# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

**శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా**

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

గూడూరి వెంకట రత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ఎస్. రామతారక పరబ్రహ్మ శాస్త్రి

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ వి.వి. ఆర్ ప్రసాదరావు

డా॥ యమ్. స్వర్ణముఖి



సంపుటి 33 సంచిక 8
పేజీలు 40
ఏప్రిల్ 2014

**5సం॥ల చందా రూ. 250**
**2సం॥ల చందా రూ. 120**
**సంవత్సర చందా రూ. 60**
**విడిప్రతి వెల...... రూ. 5**

బ్యాంక్ డ్రాఫ్టు A/C Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL


**ఈ సంచికలో** ............................ ....... **పేజీ**


| | |
|---|---|
| భద్రవాక్యం ........................................ | 2 |
| శ్రీబాబూజీ ఉవాచ | 4 |
| పరీక్షిత్తు | 6 |
| సన్నిధిలో సంభాషణ | 8 |
| యోగవాశిష్ఠము | 10 |
| శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు | 12 |
| రాజయోగము | 13 |
| జ్ఞానము | 15 |
| పరిప్రశ్నేన సేవయా | 17 |
| నిడమర్రులో సప్తాహ్నిక దీక్ష | 19 |
| కాళిప్రభో! కాళిప్రభో! | 21 |
| శ్రీకృష్ణ కర్ణామృతము | 22 |
| భగవద్గీత – వర్తమాన సమాజం | 24 |
| సత్యం శరణం గచ్ఛామి | 26 |
| రత్నాకరుడు | 28 |
| శ్రీ దత్తాత్రేయుడు–పరశురామ సంవాదం | 30 |
| సత్సంగామృతం | 32 |
| దాశరథీ! కరుణాపయోనిధీ! | 34 |
| యాజమాన్యం తదితర వివరాలు | 36 |
| సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర | 37 |
| విష్ణు కథలు – 'రోహిదాసు' | 39 |

# భద్రవాక్యం

– పరాశర ప్రసాద్

ఏకం వా సర్వయత్నేన ప్రాణాం స్త్యక్త్వా సమాశ్రయేత్ ।
ఏకస్మిన్వశగేయాన్తి చత్వారోఽపి వశం యత:

(వశిష్ఠ గీత, ముముక్షు ప్రకరణము, 33 శ్లో)

మోక్షాపేక్ష కలిగిన సాధకులంతా మోక్షద్వారానికావల యున్న నలుగురు ద్వారపాలకులను అధిగమించ గలిగినప్పుడే అది సాధ్యమనేది శాస్త్ర వాక్యము. శమము, తత్త్వవిచారణ, సంతోషం, సాధుసంగమము అనే ఆ నాలుగు అవరోధాలు. శమము అంటే అంతరేంద్రియ నిగ్రహము. ఇంద్రియాలకు అధినేత మనస్సు. అది సంకల్ప వికల్పాలకు నిలయము. దాన్ని జయించటం అంత సులభం కాదు. కారణం నిరోధిస్తే, కార్యం జరగకుండా నిలుపవచ్చుననే పెద్దల భావన ప్రకారం మనస్సులోని సంకల్ప వికల్పాలకు హేతువైన జన్మాంతర వాసనలను జయించాలి. అది ప్రత్యక్షముగా సాధ్యమా? అసంభవము.



అలాగే తత్త్వవిచారణలో 'నేనెవరు? ఈ జగత్తు ఎలా ఉద్భవించింది? దీనికి కర్త ఎవరు? ఉపాదాన కారణమేది?' అన్న నాలుగు ప్రశ్నలకు సమాధానము దొరికితే విచారణ సులభమైనట్లే భావించాలి. అదికూడ భావించినంత సులభతరమైనది కాదు. నేను జగత్తుకు, దేహమునకు, ఇంద్రియాలకు, పంచకోశములకు, పంచప్రాణములకు, మనస్సుకి, బుద్ధికి సాక్షిని అనే విషయాన్ని అనుభవపూర్వకంగా విచారణ చేయాలి.

జగత్తుకు కర్త, సర్వజ్ఞుడు, సర్వశక్తి సంపన్నుడు అయిన ఈశ్వరుడే అని ఆరూఢంగా తెలుసుకోవాలి. ఆ స్థితిలో మాయయే జగత్తుకు ఉపాదాన కారణమని తెలుసుకోగలుగుతాడు. ఇదంతా సాధకునికి అత్యంత సులభతరమా? ఇక మూడవది సంతోషము. అది ఏదైనా వస్తువును పొందటం ద్వారా లభించేది మాత్రం కాదు. ఏరకమైన

అసంతృప్తి, ఆశ లేకపోవటమే సంతోషానికి మూలము. ఆశ, అసంతృప్తి లేని సాధకుడు ఉంటాడా? సందేహమే.

అందువలన వశిష్ఠులవారు శ్రీరామచంద్రునికి ఉపదేశిస్తూ పై మూడు అవరోధాలను అధిగమించనప్పటికీ నాల్గవది అయిన సజ్జన సాంగత్యం అలవరచుకుని మహాత్ముల బోధను శ్రవణము చేస్తూ మనో మాలిన్యాన్ని తొలగించుకుంటే క్రమేపి మిగిలినవి కూడా సంప్రాప్తించ వచ్చు. నాలుగింటిలో ఏదైనా ఒక్కటి సాధించ గలిగితే చాలు మిగిలిన మూడును వశమగుట తథ్యము.

మలిన చిత్తమునందు ఆత్మజ్ఞానము స్థితి పొందదు. మలిన ఉపరితలముగల అద్దములో ప్రతిబింబము గోచరించదు కదా! మోక్షప్రాప్తికి మనోనిగ్రహము తప్పదు. దానిని సాధించటానికి ముందుగా సజ్జన సాంగత్యము అవసరము.

శ్రీబాబూజీ మహరాజ్ భక్తులకు బోధ చేస్తూ సాధకుడు ఒక సంకల్పాన్ని గాని, గుణాన్ని గాని జయించగలిగితే ధన్యుడే. మిగిలినవి తప్పక దూరం అవుతాయి అన్నమాట సారాంశము దీనికి భిన్నము కాదుకదా!



# శ్రీ బాబూజీ ఉవాచ

- పరాశర ప్రసాద్

శ్రీ బాబూజీ మహరాజ్ భక్తులకు బోధచేస్తూ “గురుమూర్తి వద్ద వ్యర్థ ప్రసంగాలు చేయకూడదు. అహంకారపూరిత వాక్యాలు పలుకకూడదు. మనస్సు దాయకూడదు. సత్యమునే పల్కాలి “సత్యం బ్రూయాత్ ప్రియం బ్రూయాత్” అన్నారు. శ్రీ బాబూజీ మహరాజ్ ఇంకా మాట్లాడుతూ ‘అన్ని విషయాలు గురుమూర్తికి చెప్పాలా’ అనేవారు కొందరు; ‘బాబుగారు కోపంగా ఉన్నారు’ అనేవారు



మరికొందరు. ‘నేను కోపంగా ఉన్నాను’ అని అంటే మామిడిపండుని మామిడికాయ చేసినట్లేకదా! విభూతిని పేడగా మార్చగల్గుతారా! ఇటువంటి ప్రసంగాలు రావటానికి కారణం ఏమిటి? గురుమూర్తి చెప్పినట్లు శిష్యులు నడుచుకోవాలా? లేక శిష్యులు చెప్పినట్లు గురుమూర్తి నడుచుకోవాలా? నేను విశ్రాంతి తీసుకునే సమయంలో నా ఇంటర్వ్యూకోసం వేచి ఉంటే నన్ను బయటికి వచ్చి ఇంటర్వ్యూలు ఇమ్మని ఆదేశించినట్లు అవుతుంది కదా! సాధకులు ఈ విధంగా ప్రవర్తించటానికి కారణం ఏమిటి? అది వారి విశ్వాసంలో లోపమన్నమాట.

మీకుఇంకొక ఉదంతం చెపుతాను కొంతమంది సాధకులు వచ్చి మేము సాధనసరిగా చేయలేక పోతున్నాము అని చెప్పి దుఃఖిస్తారు. అలాంటి వారంటే నాకు చాలా అసహ్యము. సాధన చేయాలి అని తెలుసు. సాధన చేయటం లేదు అని తెలుసు. మరి నీ తప్పు నీవే సరిదిద్దుకుని సాధన సరిగా చేయవచ్చుకదా! అందులో నా తప్పు ఏమన్నావుందా! ఇటువంటి సంఘటనలకు కారణం విశ్వాసము లోపించటమే. దీనిని సరిచేసుకునే మార్గము గురువాజ్ఞపాలన చేయటమే.

మీకు ఇంకొక సంఘటన చెపుతాను. నాకు పొగడ్తలన్నా, పబ్లిసిటి అన్నా ఇష్టముండదని తెలుసుకదా! గుంటూరులో సత్సంగానికి బ్యాండు వాయిద్యాలు, ఊరేగింపులు వద్దన్నాను. అయినా వారు నా మాటని కాదని ఏర్పాట్లు చేసుకున్నారు. దైవ నిర్ణయం ఎలా ఉంటే అలా

జరుగుతుంది అని హెచ్చరించాను. మరి వరుణదేవుడు పంచభూతములలో వాడేగా నామాట మీద గౌరవంతో కరుణించాడు. పెద్ద గాలివానవచ్చి బ్యాండు, ఊరేగింపు రద్దయినాయి. ఇందు నా తప్పేమిలేదుగా. చూశారా! ఇలా ఉంటాయి మా తిప్పలు. నా బాల్యంలో ఎన్నో కష్టాలు పడ్డాను. మడి ఆచారాల పేరుతో నాకు త్రాగటానికి నీరు కూడా చెంబుతో ఎత్తి నాచేతిలో పోసేవారు. ఆనాడు దానిని సంతోషంగా స్వీకరించాను. ఈనాడు ఈ రకంగా గౌరవించినా సహిస్తున్నాను" అన్నారు.

శ్రీ బాబూజీ మహరాజ్ ఇంకా మాట్లాడుతూ "మనస్సు ప్రవృత్తిలో మార్పు వస్తే గాని విశ్వాసం పెంపొందదు. నీవు తీసుకునే ఆహారం దేహపుష్టికి తోడ్పడుతుంది గాని మనస్సుకి అందదు.

గురుమూర్తి అందించిన బోధ మనస్సుకి తగిన ఆస్వాదన. దాని ద్వారా నీవు నమ్మిన గురుమూర్తికి నీ హృదయంలో స్థానాన్ని కల్పించి నీకు కష్టసుఖాలలో ఆయన సహాయపడతాడనే విశ్వాసం కల్గుతుంది. అది నీలో భక్తి, వైరాగ్యాన్ని పెంపొందించి అవసరము వచ్చినప్పుడు నీవు శ్రవణము చేసిన గురుబోధను మననానికి తీసుకువచ్చి నీ మనస్సుని స్థిర పరుస్తుంది. గురుమూర్తి బోధా శ్రవణము చెరకురసం త్రాగినట్లుగా ఉంటుంది. దానికి భిన్నంగా సాధకుడు ఆధ్యాత్మిక గ్రంధాలు పఠించి సాధించాలనుకుంటే చెరకుగడ నమిలి రసాన్ని స్వీకరించినట్లవుంతుంది అన్నారు.

శ్రీ బాబూజీ మహరాజ్ ఇంకామాట్లాడుతూ సమర్థుడైన సద్గురుమూర్తి నీలో ఉన్న ప్రాపంచిక మోహాన్ని తొలిగించి నిన్ను ఉద్ధరిస్తాడు. సద్గురు మూర్తి సంరక్షణలో ఉన్న సాధకుడు ఎన్ని దుర్గుణాలు మనస్సులో ఉన్నా అవి ఆచరణకు రావు కాబట్టి ఎన్నడూ పాపకార్యము చేయడు. పుణ్యకార్యము చేయకపోయినా పుణ్యభావన కల్గుతుంది. భావన మంచిదైతే ఆచరణ లేకపోయినా తప్పక సాధన ఫలిస్తుంది. గురుశుశ్రూష ద్వారా ఇంద్రియ నిగ్రహం కల్గుతుంది. సుకృత కర్మల ద్వారా వాసనలు హరిస్తాయి. మనస్సులో వివేకములేని మోహము లేక ప్రేమ తొలగిపోతుంది" అన్నారు శ్రీ బాబూజీ మహరాజ్.

# అమ్మమాట

-జపమాలా ప్రసాద

## ఏడు రోజులలో తరించిన పరీక్షిత్తు

(నిడమర్రు సత్సంగాలలో శ్రీమాతజీవారి అనుగ్రహ భాషణ నుండి - 5-3-2014 బుధవారం)

“భగవంతుడు మనకు ఏడురోజులు సత్సంగ సేవా భాగ్యాన్ని ప్రసాదించాడు. పరీక్షిత్తు ఏడు రోజులు భాగవత శ్రవణం చేశాడు. ఎందుకు? 7 రోజులలో తనకు మరణం ఉన్నదని తెలిసి, దాని నుండి తరించే మార్గం వెతుక్కున్నాడు. అంటే మరణం నుండి తప్పించుకుందామని అనుకోలేదు. కానీ మరణించేదేదో, మరణించనిదేదో తెలుసుకున్నాడు. మరణించేది కేవలం భౌతిక శరీరమేనని, తాను నిత్యత్వము, శాశ్వతము అయిన చైతన్య స్వరూపము అని గుర్తించాడు. ఈ గురుతు తెలిపినదెవరు? గురు



స్వరూపుడైన శ్రీశుకమహర్షి వలన 7రోజులు భాగవత శ్రవణం చేయటం అనేకంటె, ఆ భాగవత అమృతంలో పూర్తిగా లయించిపోయి, తానమృత స్వరూపుడయి పోయాడు పరీక్షిన్మహారాజు.

పరీక్షిత్తుకు దేహానికున్న ప్రారబ్ధ కర్మ విడిపోయింది. అది పోయాక, యింకా యీ దేహంలో ఉంటానంటే లోపల ఉన్నవాడు ఊరుకోడు. ‘సన్న్యస్య శ్రవణమ్ కుర్యాత్’ అని శాస్త్ర వాక్యం. అదే చేశాడు పరీక్షిన్మహరాజు. అంటే కాషాయ వస్త్రాలు కట్టుకుని కూర్చుని శ్రవణం చేయాలని కాదు. ‘సన్న్యస్య’ అంటే బయట విడిచి వచ్చిన చెప్పుల మీద భ్రాంతి, ఇంటిలో పొయ్యిమీద పాలు పెట్టి వచ్చేశామే అనే ఆలోచనలు, బయట ఆరేసుకున్న బట్టల మీద మనసు..... ఇంకా ఇంకా అనేకమైన యితర విషయాలన్నిటినీ వదిలి, శ్రవణం చేయాలి. ఏకాగ్ర చిత్తంతో వినాలి.

మనసెప్పుడూ దిగజారకూడదు. పవిత్ర అంతఃకరణతో శ్రవణం

చేస్తే, అది హృదయానికి పడుతుంది. అది పరీక్షిత్తుకి పుష్కలంగా ఉంది. అనుక్షణం జనించి, గతించే యీ జగత్తులో ఇంద్రియ గోచరమైనది ప్రతీదీ మారేదే అని ఆరూఢంగా ఎరిగినవాడు పరీక్షిత్తు. 'జాతస్యహి ధృవో మృత్యుః। ధృవం జన్మ మృతస్యచ। తస్మాదపరిహార్యేర్థే। నత్వమ్ శోచితు మర్హసి' అన్న గీతావాక్యాన్ని పరిపూర్ణంగా అవగాహన చేసుకున్నవాడాయన.

అవడానికి పరీక్షిత్తు గృహస్థే. సంసారం అంటే భార్యాపిల్లలు కలిగి ఉండటం మాత్రమే కాదు. ఈ ప్రపంచంలోని మారిపోయేదాని మీదకు మనసు వెళితే అది సంసారమే. అంతెందుకు, 'ఈ పాట నేనే పాడాలి; ఈ సేవ నేనే చేయాలి; ఇది నేనే తినాలి' - అనే భావనలు వచ్చినా, మనసు మైలపడినట్లే. ఇదే సంసార భావన. "ఎక్కడ నా మనసు జారి పోతుందో, ఎక్కడ మైల దృష్టి నన్నావరిస్తుందో" అని నిజజాగ్రత కలిగి ఉండాలి. అటువంటి జాగరూకత కలిగి ఉన్నవాడు పరీక్షిన్మహారాజు.

ఏడు రోజులలో తన దేహానికి మరణం సంభవించబోతున్నదని తెలిసి, ఆయన ఏడుస్తూ కూర్చోలేదు. తనకి ఏడురోజుల్లో శ్రేయో మార్గాన్ని చూపేదెవరా అని వెదుక్కున్నాడు; తపించాడు; అప్పుడు ఎక్కడా ఆవుపాలు పితికేటంత సమయం కూడా ఉండని శ్రీశుకమహర్షి, తమంతట తామే అక్కడకి రావడం, పరీక్షిత్తుకి భాగవత శ్రవణం చేయించటం సంభవించినది. పరీక్షిత్తు ఆత్మబంధువుని ఆశ్రయించాడు. కనుక ఆత్మ సామ్రాజ్యానికి వారసుడయ్యాడు.

-సశేషం

**చిటారుకొమ్మన కూర్చున్న చిలుక, కొమ్మ ఊగితే భయపడదు. ఎందుకంటె అది కొమ్మల మీద ఆధార పడలేదు. దాని రెక్కల పైనే ఆధారపడింది.**

**మనమూ అంతే సంసారాశ్వత్థ శాఖపై ఊగుతున్నాము. భక్తి వైరాగ్యాలనే రెక్కల బలం ఉంటే భయపడ వలసిన అవసరం లేదు.**

# సన్నిధిలో సంభాషణ

- పరాశర ప్రసాద్

శ్రీబాబు భక్తులనుద్దేశించి మాట్లాడుతూ "పండితులంతా కలిసి తమ పాండిత్యంతో శ్రీకృష్ణ పరమాత్ముడిని పాండవ పక్షపాతి అని వర్ణిస్తారు. ఇది న్యాయమేనాండీ?" అని ప్రశ్నించారు. శ్రీ బాబు ఇంకా మాట్లాడుతూ "శ్రీకృష్ణ పరమాత్ముడే పాండవ పక్షపాతి అయితే కురుక్షేత్ర సంగ్రామాన్ని నివారించటానికి బాధ్యత వహించి కౌరవుల వద్దకు రాయబారానికి ఎందుకు వెళ్ళినట్లు? యుద్ధరంగంలో భక్తులందరి మధ్య నిలచి ఎవరిని ఏ విధంగా తరింపజేయాలో వారికి ఆ విధంగా మోక్షాన్ని ఇచ్చి తనలో చేర్చుకున్నాడు. దీనిని అర్థం చేసుకున్న వారు ఎంతమంది?



అర్జునుడు, దుర్యోధనుడు ఇరువురూ శ్రీకృష్ణుని సహాయం కోసం వెళ్ళారు. శ్రీకృష్ణ పరమాత్ముడు మాత్రం అతి చిన్న ద్వారం గల ఇంట్లో హంసతూలికా తల్పముపైన పడుకొని గురకపెట్టి నిదురిస్తున్నాడు. ముందుగా దుర్యోధనుడు వెళ్ళాడు. పరిస్థితిని చూశాడు. ద్వారం చాలా చిన్నది తలవంచి దూరి వెళ్ళాలి. పైగా ద్వారానికి ఎదురుగా పాదాలు కనపడేటట్లు పెట్టాడు. దుర్యోధనుడిలో అహంకారం జనించింది తల వంచి వెడితే మా సార్వభౌమత్వానికి అవమానం. ఆ నల్లవాడి వంశం వాళ్ళకు వేపకాయంత వెర్రి ఉంటుందంటారు. శూద్రుడు కదా మర్యాద తెలిస్తేగా? అని అనుకున్నాడు. దుర్యోధనునిలో నీచ ఆలోచనలు, నీచభావాలు కలిగిన కొద్దీ కృష్ణ పరమాత్ముడు ఇంకా గురకపెట్టి నిద్రపోతున్నాడు. దుర్యోధనుడు ఎలాగో తన శిరస్సును పూర్తిగా వంచకుండా లోపలికి వెళ్ళటానికి ప్రయత్నించే సరికి కిరీటం ద్వారానికి తగిలి క్రిందపడి దొర్లుకుంటూ వెళ్ళి కృష్ణపరమాత్ముని పాదాల చెంతకు చేరింది. అది దుర్యోధనునికి హెచ్చరిక లాగా ఉంది.

పిచ్చివాడా! నీకు కిరీటం ఉండదురా. నీ సార్వభౌమత్వానికి లోటు వస్తోంది అన్నట్లుగా ఉంది. చూశారా! పరమాత్ముడు ముందుగానే

తెలియజేశాడు. దుర్యోధనుడు క్రిందపడిన కిరీటాన్ని తీసుకుని చుట్టూరా పరికించి చూసి అదేంటి బావా అలా పడిపోయావు అని కృష్ణ పరమాత్ముడు హేళన చేస్తాడేమో అని భావన చేస్తుంటే ఆయన గురకపెట్టి నిదురిస్తున్నాడు. సరేలే చూడలేదులే అనుకొని కృష్ణపరమాత్ముని శిరస్సు వేపున గల కుర్చీలో కూర్చున్నాడు.

ఇంతలో అర్జునుడు వచ్చాడు. శిరస్సు వంచి శ్రీకృష్ణ పరమాత్ముని పాద పద్మాలకు నమస్కరించాడు. 'ఆహా! ఏమి నా భాగ్యము! అన్యులెవరికి లభ్యం కాని నీ పాదపద్మముల దర్శనాన్నిచ్చి నా జన్మకు ధన్యత్వాన్ని ఆపాదించావు, దీనబాంధవా! భక్త జనరక్షకా!' అంటూ ఆయన పాదసేవ చేసుకున్నాడు.

చూశారా! సజ్జనుల ఆలోచనా విధానము ఎలా ఉంటుందో? మీరే నిర్ణయించండి. మీరంతా పండితులు. శ్రీకృష్ణ పరమాత్ముడు హంసతూలికా తల్పముపై హాయిగా నిదురిస్తున్నాడు. ఈ ఇరువురిలో ఏ ఒక్కరినీ ఆయన ఆహ్వానించలేదు. వారే స్వయంగా శ్రీకృష్ణ పరమాత్ముని సహాయం కోరి వచ్చారు. ఇక్కడ రెండు పాత్రలు ఉన్నాయి. ఒకటి అర్జునుని రూపంలో సజ్జనుడు దాసానుదాసుడై భక్తి ప్రపత్తులతో పాదసేవ చేస్తూ సహాయాన్ని అర్థిస్తున్నాడు. ఇక రెండవ పాత్ర దుర్యోధనుని రూపంలో నీచభావాలు, అహంకారముతో కూడి ఉండి తాను ఏ వ్యక్తి సహాయం కోరనున్నాడో ఆ వ్యక్తిని మనస్సులో నిందిస్తున్నాడు. అయినా పరమాత్ముడు ఏమన్నా వివక్షత చూపించాడా? పక్షపాత బుద్ధి ఉందా? శ్రీకృష్ణ పరమాత్ముడు లేచి ముందుగా అర్జునుడిని చూశాడు. 'బావా! ఎప్పుడు వచ్చావు. అంతా క్షేమమే కదా?' అన్నాడు. ఆ తరువాత హంస తూలికా తల్పము నుండి లేచి మూడు అడుగులు వేసి దుర్యోధనుడిని చూశాడు. ఎందువల్లనంటే దుర్యోధనుడు త్రిగుణములతో కూడిన వాడు కనుక. వెంటనే 'బావగారూ! ఎప్పుడు వచ్చారు? భీష్మద్రోణాదులు కుశలమే కదా!' అని సంబోధించాడు. ఆ సంబోధనలోనే ఉంది, పరమాత్మకూ దుర్యోధనునికి మధ్య త్రిగుణములంత దూరం అని. అందువలననే దుర్యోధనుడు చెత్తను కోరుకున్నాడు. అర్జునుడు మాత్రం నీలమణిని కోరుకున్నాడు. విజయం సాధించాడు" అన్నారు.

# యోగవాశిష్ఠము

(గత సంచిక తరువాయి)

-సుషుమ్న ప్రసాద

## సిద్ధుని కథ

వశిష్ఠ మహర్షి, శ్రీరామచంద్రునికిలా ప్రబోధించారు. మనసుకు స్వతంత్రమైన ఉనికి లేదు. అలలు సముద్రపు నీరుపై యెలా ఆధారపడి ఉన్నవో, అలాగే మనసు పరమాత్మపై ఆధార పడివున్నది. మనసు చాలా చంచలమైనది.



దానికి స్నేహితుని విరోధిగా, విరోధిని స్నేహితునిగా భావింపచేసే సమర్థత వున్నది. ఉన్నతమైన స్థితి నుండి క్రిందకు పడవేయ గలదు. అట్టడుగుస్థితి నుండి ఉన్నత స్థితికి చేర్చగలదు. దానికిప్పుడున్న స్థితి, భావన మరొక క్షణములో మార్చగలదు. సత్యమును అసత్యముగ, అసత్యమును సత్యముగా, భావింపచేస్తుంది. సుఖము, బాధ, ఆనందము, దుఃఖము, సంతోషము, విచారమనేవి మనసు చేత సృజింపబడ్డవి. మంచి, చెడు కర్మల ఫలితాన్ని, మనసే అనుభవింప చేస్తుంది. మనసుకు భిన్నంగా, యే వస్తువు యొక్క అనుభూతిని పొందలేము. అన్ని భావాలకు, ఆలోచనలకు మనసే మూల కారణము.

నీవు వినటం,చూడటం, అనుభూతి పొందటము, రుచి చూడటం, వాసన చూడటము, మనసు ద్వారానే జరుగుతున్నవి. ఈ శరీరాన్ని కదిలించేది మనసే. కాలము, దూరము, ప్రదేశము, నిడువు, వెడల్పు, ఎత్తు, త్వరితము, నిదానము, ఉన్నతము, అల్పము, మిక్కుటము, స్వల్పము, నలుపు, ఎరుపు మున్నగు యీ ద్వంద్వాలన్నీ మనసులోనే ఉత్పన్నమయినవి. ఈవైవిధ్యములన్నీ మనసుకు సంబంధించనవే.

వస్తువులు (విషయాలు) గురించిన బంధానికి దారి తీస్తాయి. ఆలోచనలను విసర్జించటము స్వేచ్ఛకు దారితీస్తుంది. సంకల్పాల యొక్క విస్తరణే విశ్వంగా మారింది. ఈ ప్రపంచమంతా

ఒక ప్రదర్శనలాంటిది. ఈ ప్రదర్శనకు మనసే మూలం. ఏ రకంగా ఋతువుల మార్పువలన వృక్షాలలో మార్పువస్తుందో, అలాగే మనసు మానవుల ప్రవృత్తులలో మార్పు తెస్తుంది.ఈ ప్రపంచములో యెంత మంది మానవులున్నారో అంత మానసిక వైవిధ్యము కూడ వున్నది. ఒకే రకం మానసిక ప్రవృత్తిగల యిద్దరు మానవులుండటము దుర్లభము.

మనసు విషయాలతో (వస్తువులతో) ఆడుకొంటుంది. అది మాయను సృజిస్తుంది. మనసు యొక్క క్రీడవలన సమీపము చాలా దూరంగా ఉన్నట్లు, చాలా దూరం దగ్గరగా ఉన్నట్లు గోచరిస్తుంది. క్షణాన్ని ఒక యుగంలా, యుగాన్ని ఒక క్షణంలా భావింప చేసేశక్తి మనసుకున్నది. "ఓ రామా! యీ భావనను చక్కగా అవగాహన చేసుకొనేందుకు, నీకొక ఆసక్తి కరమైన కథను వర్ణిస్తాను శ్రద్ధగావిను.

హరిశ్చంద్ర మహారాజు వంశమునకు చెందిన లవణ మహారాజు, ఉత్తర పాండవ దేశాన్ని పరిపాలించేవాడు. అతను చాలా ప్రజ్ఞావంతుడు, శీలవంతుడు, ప్రతిభావంతుడు. ఒక రోజు లవణ మహారాజు సింహాసనముపై ఆశీనుడైనాడు. అతని మంత్రులు, ప్రభుత్వాధికారులందరూ రాజ దర్బారులో వున్నారు. ఆసమయంలో ఒక సిద్ధుడు లేక మాంత్రికుడు సభలో ప్రత్యక్షమైనాడు. అతను చక్రవర్తికి మోకరిల్లి, యిలా అన్నాడు. " ఓ ప్రభూ ! నేను చేసే అద్భుత దృశ్యాలని తిలకించండి "అలా అంటూ సిద్ధుడొక నెమలియీకల గుత్తితో కూడిన చామరాన్ని, రాజుగారి ముందు విసనకఱ్ఱలా విసిరాడు. వెంటనే ఆమాంత్రిక శక్తితో రాజు గారు అనూహ్యమైన అనుభవాన్ని పొందారు. ఆ అనుభవాలిలా వివరింపబడ్డవి.

-సశేషం





# శ్రీ కాళీ గార్డెన్స్ కార్యక్రమాలు

ఏప్రిల్ 2014

1 మంగళవారం నుంచి 7 సోమవారం వరకు :

మౌన ధ్యాన సప్తాహ శిబిరం.

8 మంగళ : శ్రీ రామనవమి - ఉదయం గం.5.30లకు శ్రీ సద్గురు పాదపూజ; 11గం.లకు సామూహిక శ్రీ సీతారామ కళ్యాణము ;

భక్త సమారాధన.

15 మంగళ : పూర్ణిమ - శ్రీ సద్గురు పాద పూజ.

24 గురువారం : శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

27 ఆది : మాస శివ రాత్రి.

29 మంగళ : అమావాస్య

మే 2014

2 శుక్ర : అక్షయ తదియ - శ్రీసద్గురుపాదపూజ

4 ఆది : శ్రీశంకరాచార్య జయంతి; శ్రీసద్గురు ఏకోనవింశతి వార్షిక ప్రతిష్ఠా మహోత్సవము - శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్త సమారాధన

14 బుధ : వైశాఖ పూర్ణిమ - (బుద్ధ జయంతి) శ్రీసద్గురుపాదపూజ, సత్సంగ సమావేశము, భక్తసమారాధన

19 సోమ : శ్రీమహాకాళికా పరమేశ్వరీసమేత శ్రీరామలింగేశ్వరస్వామి వార్షిక ప్రతిష్ఠా కళ్యాణ మహోత్సవము.

23 శుక్ర : శ్రీగురుదశమి; హనుమజ్జయంతి- సత్సంగం ;

శ్రీసద్గురుపాదపూజ

27 మంగళ : మాసశివరాత్రి

28 బుధ : అమావాస్య



# రాజయోగము

- వార్తాలాపము

ఒక బ్రాహ్మణ కుమారుడు సంసారంలో అనేకములైన యిబ్బందులు వున్నాయని, జ్ఞానసంపాదనకు సన్యాసము ఉత్తమమని అతనికి తోచెను. సన్యాస దీక్ష స్వీకరించటంకోసం మంచి సన్యాసికై అన్వేషించాడు.

అప్పుడతనికి "ఫలానా గ్రామంలో జ్ఞాన మఠము అనే మఠము ఉంది. అందులో మహావిద్వాంసుడగు ఒక సన్యాసి ఉన్నారు. వారు వద్దకు వెళ్ళు" అని ఒకడు సలహా చెప్పాడు.

అతడు అక్కడకు వెళ్ళి ఆ స్వామివారికి నమస్కరించి కూర్చున్నాడు. స్వామివారు ప్రేమతో "నీవు ఎవరు? ఎందుకు వచ్చావు?" అని అడిగారు. అందుకు సమాధానంగా "నేను బ్రాహ్మణ కుమారుణ్ణి సన్యాసము స్వీకరించటానికై తమ సన్నిధికి వచ్చాను" అని చెప్పాడు.

అంతట స్వామి వారు "సన్యాసము స్వీకరించుట వేళాకోళం కాదు. నాలుగైదు మాసాలు యిక్కడే ఉండు. నీకు పూర్ణ వైరాగ్యం కలిగిందని నాకు తోచినప్పుడు దీక్ష యిస్తాను" అని చెప్పారు.

కొన్ని రోజుల తరువాత స్వామివారు తన మఠము నందలి వ్యక్తులను అతనికి పరిచయం చేస్తూ "ఈయన మా చిన్న గురువుగారు, ఇతడు నా సతీర్థుడు, ఇతడు నా శిష్యుడు" అని చెప్పారు.

తరువాత విశాలమైన మఠమునందలి ప్రతి భాగమును వివరిస్తూ చూపించారు. ఇది గోష్ఠి మందిరము. ఇది సామాను గది. ఇది భోజనశాల. ఇది అతిథి గృహము. ఇది పడక గది. ఇది ధాన్యాగారము. ఇది ధనాగారము. ఇదిగో చూడుము పశువుల శాలలో అశ్వములు, రథములు, ఆవులు, గేదెలు మొదలగునవి. ఏ లోపమూ లేదు. ఈ మఠమునకు ఐదు ఆరు శాఖలున్నాయి. ఆ యా నగరాలలో దుకాణాలు కూడా ఉన్నాయి. వాటి అద్దె చాల వస్తుంది. అనేకమంది మహారాజులు, ధనవంతులు యీ మఠానికి సేవకులు. ఆ శ్రీమంతులు చాల భూమిని జాగిరిగా యిచ్చిరి" అంటూ ఇంకా మిగిలిన ఆస్తులు వివరాలు కూడా చెప్పారు.

కాని పిల్లవాడు శ్రీమంతుల బిడ్డ. పైవాటి వలన వానికేమాత్రము ఆకర్షణ కలుగలేదు. అంతేకాదు, ఇవన్నీ చూశాక అతనికి ఆలోచన కలిగింది. “ఇల్లు, వాకిలి మొదలగు ఉపాధులు విడచి యిక్కడికి వచ్చాను. ఇక్కడ పదిరెట్లు ఉపాధి కనిపిస్తోంది. ఈ జ్ఞానమఠము నందు ఉండి జ్ఞానమును పొందుట బదులు. అజ్ఞానంలో చిక్కుకుంటాను. ఇది పెనం మీద నుండి పొయ్యిలో పడినట్లు అవుతుంది. ఇంతకంటె నా యిల్లే మంచిది” ఇలా ఆలోచించి అతడు జ్ఞానమఠం విడిచి వెళ్ళిపోయాడు.



**శ్రీకాళహస్తీశ్వరా! నేను శ్రీశైలమల్లికార్జుని సేవించలేదు. శివకంచిలో ఉన్న ఏకామ్రనాధుని అర్చించలేదు. కాశీవిశ్వనాధుని కొలువలేదు. ఉజ్జయినీ మహాకాళేశ్వరుని పూజించలేదు. ఏదియును చేయని వాడనైనాను. దేవా! నా భక్తి అణువంతదైనా గొప్పదిగా భావించి, దయ అనేడు సంపత్కరమైన విలాసపూర్వక సంతోషముతో నన్ను రక్షింపుము.**

శ్రీకాళహస్తీశ్వర శతకము -71

# జ్ఞానము

-ఓం కాళి

జ్ఞానము అనగా బోధ, తెలివి పరమాత్మను తెలిసికొనుట. మానవునికి జ్ఞానమే భూషణము. జ్ఞానము లేని మానవుడు ద్విపాద పశువు. "అభేద దర్శనం జ్ఞానం". ఏ క్షేత్రానికి వెళ్ళినా తన గురుదేవుల దర్శనం పొందుటే జ్ఞానం. అన్ని జీవుల యందు ప్రకాశిస్తున్న చైతన్యం తనలోను ప్రకాశిస్తుందని తెలియబడుటయే జ్ఞానము. శ్రీపరమ గురువులు తమ ప్రసంగాలలో............

"యస్య సర్వే సమారమ్భాః కామ సంకల్ప వర్జితాః।
జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణం తమాహుః పణ్డితం బుధాః॥"

అని శ్రీభగవద్గీతా శ్లోకం తరచూ చదివించేవారు. పండితుడు అనగా ఎటువంటి వాడు? భగవంతుని దృష్టిలో పాండిత్య మనగా ఏమి? కామము అనగా 'కోరిక'. పవిత్రమైన అంతఃకరణ కలిగి కోరికలనేవి లేకుండా ఎవరైతే జ్ఞానమనే అగ్నితో దహింపబడతారో వారు శ్రీ గురుదేవుల దృష్టిలో (భగవంతుని) పండితులు. వారే భక్తులు. దేనియందూ ఆశలేనివాడు, ఇంద్రియములు, మనస్సు, బుద్ధి, చిత్త. అహంకారము లేనివాడు 'జ్ఞాని' అని పిలువ బడతాడు. అన్ని యజ్ఞాలలో కెల్ల 'జ్ఞాన యజ్ఞము' శ్రేష్ఠమైనది. అట్టి జ్ఞానమును శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీత మరో శ్లోకంలో

తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా।
ఉపదేక్ష్యన్తితే జ్ఞానం జ్ఞానిన స్తత్త్వ దర్శినః॥

అని తెలియజేశారు. సమర్థులైన గురుదేవుల వలన మనకు ఆ జ్ఞానం లభించగలదు. ఏలననగా సమయముచూచి శ్రీ గురుదేవుల పాదపద్మములకు సాష్టాంగ నమస్కారముచేతను, వినయముతో ప్రశ్నించుటచేతను. సేవచేతను వారి వలన తెలిసికొనవలెను. వారు తప్పక మనకు ఉపదేశించగలరు.

శ్రీగురుదేవుల ఉపదేశము వలన సాధన చతుష్టయ సంపత్తి కలుగుతుంది. అనగా 1. నిత్యానిత్య వస్తు వివేకం 2. ఇహమూత్రఅర్థ ఫలభోగ విరాగము 3. సమాదిషట్కసంపత్తి 4. ముముక్షత్వము.

ఒకసారి జ్ఞానమును పొందిన మానవుడు మోహమందు పడడు. అందరి యందు సమభావము కలిగి యుంటాడు. మహాత్ములు జ్ఞానమును అగ్నితో పోల్చారు. భగభగమండే అగ్నిలో ఒక దుంగను వేసిన ఏవిధంగా బూడిద అగునో ఆ విధంగా నే జ్ఞానమనే అగ్ని అన్ని కర్మలను కాల్చివేయుచున్నది. జ్ఞానమును పొందవలెనన్న శ్రద్ధ, తదేక నిష్ఠ. ఇంద్రియ

నిగ్రహమును కలిగియుండ వలెను. వీనివలన జీవుడు పరమ శాంతిని పొందగలడు.

శ్రీ గురుదేవులు ఒక చిన్న ఉదాహరణ తెలియజేశారు. ఒక దంపతులు తమ పిల్లలతో అల్లుడి యింటికి వెళ్ళారు. పండుగ నాలుగు రోజులు అయిపోయాయి. భర్త తన ఉద్యోగంలో చేరాలి. కాని భార్యకు పిల్లలకూ ఇంకా నాల్గు రోజులు ఉండాలని వుంది. భార్యతో నీవు బుజ్జివాణ్ణి, చంటిదాన్ని తీసుకునిరా నే వెడతానంటాడు. ముందు తాను వెడతాడు. తరువాత భార్య. జీవితమూ అంతే. ఒకరు ముందు ఒకరు వెనుక. ఇతరుల ఇంట్లో ఎవరు ఎల్లకాలము ఉండటానికి వీలులేదు. ఈ జ్ఞానాన్ని పొందటమే సత్య జ్ఞానాన్ని పొందటం.

ఈ జ్ఞానం వలన మానవుడు భక్తి , వైరాగ్యమును పొంద గలుగుతాడు. ఇవి రెండే తను ఆశ్రయించిన గురుపాదములు. పాలలో వెన్న వుంటుంది. కనబడదుకాని పాలను కాచి పెరుగుచేసి దానిని చిలికితే వెన్న వస్తుంది. దానిని మళ్ళీ పాలలో కలిపితే కలుస్తుందా. అలాగే పరమాత్మ వస్తువు అంతటా వున్నా కనబడటంలేదు. అందువలన జ్ఞానము అనే కవ్వంతో బాగా మథిస్తే దేహాతీతంగా ఉన్న పరమాత్మ తత్వం మనకు తెలియబడుతుంది.

మానవుడు అజ్ఞానంలో ఉన్నంతవరకూ ఈ శరీరం తాను అనే దుఃఖం అనుభవిస్తూ ఉంటాడు. ఎప్పుడైతే శ్రీ గురుదేవుల వలన జ్ఞానము కలిగి వివేకము, విచారణ ద్వారా తాను ఈ శరీరానికి విలక్షణుడని తెలియబడుతుందో అప్పుడు నిజమైన సుఖ శాంతులు లభిస్తాయి. పునరపి జననం పునరపి మరణం నుండి విముక్తి లభిస్తుంది. శ్రీగురువుల కృపకలిగితేచాలు క్షణంలో తన కడగంటి చూపుతోనే ఆయన మన అజ్ఞానాంధకారాన్ని బాపి జ్ఞానజ్యోతిని దర్శింపచేయ గలరు. గురుదేవుడు ప్రసాదించిన లక్ష్యార్థాన్ని మనస్సుతో బాగా రాపిడి పెడితే అందులోనుండి జ్ఞానాగ్ని బయలు దేరి కర్మ బీజాలతో సంకల్పాలతో సహా మనస్సునే దగ్ధం చేస్తుంది. మంత్రార్థమైన లక్ష్యార్థము, మనస్సు ఈ రెండూ జ్ఞానాగ్నిలో లయించి జ్ఞానమే మిగులుతుంది. తానే జ్ఞానస్వరూపుడునని తెలుసుకుంటాడు. జ్ఞానమనగా ఒక యోగము. భగవంతుని చేరు పదునెనిమిది మార్గాలలో ఇది ఒకటి. కనుక ఈ మార్గము చేరి ముముక్షువు పరమాత్మను పొందుటే జ్ఞానము.

# పరి ప్రశ్నేన సేవయా

- పరాశర ప్రసాద్

'ధ్యానం ఎలా చేయాలి? ధ్యానానికి కూర్చుంటే అనేక ఆలోచనలు రీల్సు తిరుగుతాయి. వెధవ మనస్సు నిలబడటం లేదు' అన్న భక్తుని సందేహాన్ని పురస్కరించుకుని శ్రీసద్గురుదేవులు సమాధానం చెబుతూ "మనస్సు చెడ్డది కాదు. నీలో పేరుకుపోయిన జన్మాంతర వాసనలు మనస్సుని ఆవరించి బాహ్య శబ్దాలకి, రూపాలకి, రసాలకి, స్పర్శకి, గంధాలకి స్పందన చెంది అశాంతిని కలిగిస్తోంది. నువ్వు శుభ్రమైన తెల్లని దుస్తులనే ధరించ వచ్చు. కాని బాహ్య ప్రపంచంలో దుమ్ము, ధూళి ప్రభావంచేత నీ దుస్తులు మలినమైతే ఆ తప్పు ఎవరిది? మనో మాలిన్యం తొలగటానికి వాసనా రహితం కావాలిసిందే. దానిని సమర్థులైన సద్గురు



మూర్తిని ఆశ్రయించి, ఆయన ప్రసాదించిన లక్ష్యార్థాన్ని సాధన చేయక తప్పదు. ధ్యానానికి కూర్చున్నప్పుడు ధ్యానించేది ఎవరు? ధ్యానం చేసేది దేనికోసం? అనే భావనతో నీలోపల అన్వేషించు. అప్పుడు ధ్యానిస్తున్నాను అనిగాని, ధ్యానం కుదరటంలేదనే భావన అదృశ్యమవుతుంది. అప్పుడు నీ మనస్సు ఎక్కడ మిగులుతుంది? ధ్యానంలో ఎన్నో దృశ్యాలు కనబడవచ్చు. పుట్టుక అంటూ ఉన్నదానికి అంతము తప్పదుకదా! అందువలన దానిని లక్ష్య పెట్టవద్దు. ఆ స్థితిలో నీ మనస్సు యింకా నిలబడలేదని గుర్తించు.

మనస్సు స్థిర పడిందంటే నిర్వాణస్థితిలో ఉన్నదన్నమాట. ఆ స్థితిలో దృశ్యము ద్రష్టలో విలీనము కాకతప్పదు. చివరికి 'నేను' అనే భావన కూడా అదృశ్యం కాక తప్పదు. 'నేను' అనే ఉనికి మాత్రమే మిగులుతుంది. దేహము, యింద్రియాలు, మనస్సు, బుద్ధి అన్నీ జగత్తులోనివే. అశాశ్వతమైనవి అనేది గుర్తించ గలుగుతావు. నీకు ఏకాగ్రత కలగాలంటే నీ దృష్టిలో మార్పు రావాలి. ప్రపంచంలో ఎన్ని ఆకర్షణలు ఉన్నా నీ దృష్టి వాటిలోని సత్యంపైనే కేంద్రీకరించాలి. అప్పుడు ఏ వస్తువు యందు వ్యామోహము కల్గదు కదా! ఆ స్థితిని సాధించిన వాడికి ధ్యానానికి కూర్చున్నా, ఏపని చేస్తున్నా మనస్సు అటు యిటు

పరుగులెత్తదే! మనము ఏ పని చేసినా మనస్సు దాని మీద నిలబడుతుంది. కాని ధ్యానానికి కూర్చుంటే మాత్రం నిలబడదు. కారణం మనస్సుని ఎలా ఉపయోగించుకోవాలో తెలియక సాధకులకు మనస్సు విరోధి అవుతోంది. ధ్యానానికి మనస్సు ఎన్నడూ సమస్య కాదు. జన్మాంతర వాసన చేత ప్రేరణచెందే గుణాలు. శ్రీసద్గురు మూర్తి సమాశ్రయమే దాని నివారణోపాయము.



తల్లిదండ్రులెక్కడ? కొడుకులెక్కడివారు? భార్య, చుట్టములెక్కడ? జీవుడెట్టి దేహమును ధరించి పుట్టును, చచ్చుచున్నాడు? పాపపుణ్యలమందుటకు తానొక్కడేగాని యితరులెవ్వరునూ వెంట ఉండరు. ఏదైననూ వెంటరాదు. కనుక నీ లీలలనే మాయలలో నన్ను పడవేయక పుట్టుక గిట్టుట లేకుండా చేసి నన్ను కాపాడుము భద్రాద్రి రామా!

దాశరథీ శతకము - 92

# నిడమర్రులో సాప్తాహ్నిక దీక్ష

-జపమాలా ప్రసాద

పశ్చిమ గోదావరి జిల్లా, నిడమర్రు గ్రామంలో పూజ్యయోగిని శ్రీశ్రీశ్రీ చంద్రకాళీప్రసాద మాతాజీవారి ఆధ్వర్యంలో నిడమర్రు భక్తులైన శ్రీ దేవిరెడ్డి భీమసేన్, వారి సతీమణి శ్రీమతి మాణిక్యాంబగారు, వారి అల్లుడు శ్రీస్వస్వరూపానంద, కుమార్తె శ్రీమతి సత్యరాధిక ఎంతో భక్తి శ్రద్ధలతో 5-3-2014 నుండి 12-3-2014 వరకు సప్తాహ్నిక సర్వనామ సంకీర్తన, సత్సంగ సమావేశములు, శ్రీ శ్రీనివాస రామానుజదాసు గారి 'గోపికా గీతాలు' అనెడి భాగవత ప్రవచనము, త్రయాహ్నిక శ్రీగురు హోమము ఎంతో వైభవోపేతంగా జరుపుకున్నారు. రెండు పూటలా వచ్చిన భక్తులందరికీ సమారాధన జరగటం విశేషం.

5-3-2014 బుధవారం ఉదయం 4-30 గం.లకు సుప్రభాత సేవ, ప్రార్థన జరిగిన తరువాత, ఎంతో కోలాహలంగా శ్రీసద్గురుదేవుల శోభాయాత్ర జరిగినవి. 11గం.లకు గణపతిపూజ, పుణ్యాహవచనం, కలశ స్థాపన, శ్రీగురుహోమ దీక్షా సంకల్పము, దీక్షా వస్త్ర ధారణ, దీక్షా కంకణ ధారణ జరిగిన తరువాత, అఖండ సప్తాహ్నిక సంకీర్తన కార్యక్రమాన్ని శ్రీమాతాజీ వారు ప్రారంభం చేశారు.

శ్రీ శ్రీనివాస రామానుజ దాసువారిచే భాగవత ప్రవచనము మొదలైనది. మధ్యాహ్నం శ్రీ కొండూరి రామబ్రహ్మ ప్రసాదుగారి ఆధ్వర్యంలో హోమ కార్యక్రమము జరిగినది. ప్రతిరోజూ సాయంత్రం శ్రీ భూ సమేత శ్రీబాల వేంకటేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణ వేదిక మీద సత్సంగ సమావేశాలు జరిగినవి.

7-3-2014 శుక్రవారం ఉదయం 9గంలకు సామూహిక గురుపూజలు, అమ్మవారికి కుంకుమ పూజలు ఉచితంగా నిర్వహింపబడినవి. అసంఖ్యాకంగా భక్తులు ఆ పూజలలో పాల్గొని తరించారు. ఆ తరువాత శ్రీభీమసేన్, శ్రీస్వస్వరూపానంద దంపతలు, శ్రీమాతాజీని 'శ్రీరాజరాజేశ్వరీ దేవిగా' భావన చేసి, వెండి కిరీటాన్ని, వెండి యజ్ఞోపవీతాన్ని ధరింపజేసి, కుడి హస్తమునందు ఒక శ్వేతకమలమును, ఎడమ హస్తమునందు ఒక చెరకుగడను ఉంచి, పుష్పాభిషేకం చేసి హారతులిచ్చారు. 'మనోరూపేక్షు కోదండా। పంచతన్మాత్ర సాయకా॥' అన్న అమ్మ నామాలను

ప్రత్యక్షంగా దర్శించే భాగ్యాన్ని వేలాదిమంది భక్తులు పొంది, బ్రహ్మానంద భరితులయ్యారు. మధ్యాహ్నం 2గం.లకు శ్రీగురుహోమ పూర్ణాహుతి



జరిగినది. శ్రీభీమవరం శివగారు, శ్రీ హనుమంతుగారు, శ్రీమతి సుశీలా ప్రసాద గారు, శ్రీమతి రేఖా ప్రసాదగారు, శ్రీ జపమాల ప్రసాదగారు సత్సంగ సమావేశంలో ప్రసంగించారు. శ్రీమాతాజీ వారి దివ్య అభిభాషణ సంచిక నుండి రాబోయే సంచికలలో ప్రచురింప బడును.12-3-2014 బుధవారం నాడు శ్రీగురుపాదపూజా మహోత్సావా నంతరం సాప్తాహ్నిక దీక్షా విరమణ జరిగింది.

ఈ ఏడురోజుల కార్యక్రమాన్ని శ్రీభీమసేన్ దంపతులు యింత వైభవంగా జరిపించటం ముదావహం. వారు 'మేము నిర్వహిస్తున్నాము' అనే భావన ఏ మాత్రం లేకుండా, ఇంట్లోని నలుగురూ కూడా ఎంతో భక్తిశ్రద్ధలతో అన్ని కార్యక్రమాలలోనూ పూజా హోమాలేకాక, భాగవత శ్రవణం, సత్సంగ శ్రవణంలోనూ పాల్గొని, భక్తులందరినీ పేరు పేరునా 'మీరు తిన్నారా?' అని అడుగుతూ, వడ్డన చేస్తూ ....... గృహస్థ ధర్మానికే వన్నె తెచ్చారనిపించింది. వారి సేవా నిరతికి జోహార్లు! శ్రీగురుదేవులు వారికి పుష్కలంగా సేవాభాగ్యాన్ని, అఖండ ఆయురారోగ్య ఐశ్వర్యాలను, అఖండ భక్తి జ్ఞాన వైరాగ్యాలను ప్రసాదించాలని వారి కుటుంబ సభ్యులందరికీ, అన్ని సేవలలోనూ ఎంతో ఉత్సాహంగా పాల్గొన్న నిడమర్రు భక్తులందరికీ శ్రీమాతాజీవారు తమ దివ్యాశీస్సులను వెదజల్లారు.

# కాళిప్రభో! కాళిప్రభో!

-పెనుమాక నాగేశ్వర రావు

శిరమున సుందర పింఛముతో
ఉరమున మరకత పతకముతో
కరమున మోహన వేణువుతో
స్వరమున సుమధుర సాంత్వనతో ॥శిర॥

కదలాడే కదలాడే కాళిప్రభో కాళిప్రభో
మా మదిలో కదలాడే కాళిప్రభో కాళిప్రభో
శరణం శరణం కాళిప్రభో
స్వామి శరణం కాళిప్రభో

వదనమె పున్నమి బింబముగా
చిరునగవే పువ్వుల చందముగా ॥వదన॥

సిరిచందనమే శుభకర తిలకముగా
మువ్వల రవళులే మంగళ వాద్యముగా
దిగివచ్చె దిగివచ్చె కాళిప్రభో కాళిప్రభో
దీవెనలిచ్చె దీవెనలిచ్చె కాళిప్రభో కాళిప్రభో

శరణం శరణం కాళిప్రభో
స్వామి శరణం కాళిప్రభో ॥శిరము॥



# శ్రీకృష్ణ కర్ణామృతము

గత సంచిక తరువాయి - సుశీలా ప్రసాద

అప్పుడు జరిగింది! ఆకాశంలో మెరుపులా ఒక వెలుగు, ఆ కాంతిలో గీత కళ్ళు పెద్దవి చేసి స్పష్టంగా చూసింది . తల్లి చంకలో కూర్చున్న కన్నయ్య నోట్లో పెట్టిన పెరుగన్నం ముద్ద తినకుండా తుపుక్కున ఉమ్మేసాడు. అది సరాసరి వెళ్ళి వేమగాడి తెరచి ఉన్న నోట్లో పడింది. వాడి నోరు మూత పడింది. అంటే అది మింగేశాడన్నమాట!

మల్లన్న మరోసారి చెయ్యందుకున్నాడు, నాడి ఆడుతోంది. కనురెప్పలు కదులుతున్నాయి, గుండె చప్పుడు వినబడుతోంది. "వీడు బతికే ఉన్నాడయ్యా!" మల్లన్న దృఢంగా చెప్పేసరికి వేమగాడి అన్న రెండు చేతులెత్తి దండం పెట్టాడు ఏడుస్తూ ఈసారి సంతోషంతో. కాళ్ళు చేతులు గుండే మెల్లగా రాస్తుంటే తేరుకున్న వేమగాడు లేచి కూచున్నాడు. గీత కన్నార్పక కన్నయ్యని చూస్తోంది. చందమామ లాంటి ముఖం మరింత తేజస్సుతో వెలిగిపోతోంది. కలువ రేకులలాంటి కళ్ళలో తృప్తి తాండవిస్తోంది. "నందబాబయ్యా!" అని గొంతు విప్పాడు వేమగాడు. అంతా క్షణం సేపు నివ్వెరపోతూ వాడి వంక చూశారు.



"కాలవలో పడగానే భయంతో నా గుండె ఆగిపోయింది, ఒళ్ళు బిగిసి పోయింది. అప్పుడు దిట్టంగా ఉన్న నల్లనివాళ్ళు నలుగురొచ్చి నన్ను పట్టి ఎక్కడికో లాక్కు పోతున్నారు. తల్చుకుంటే ఒళ్ళు గడగడ లాడి పోతోంది" క్షణం సేపు ఆగాడు వణుకుతూ. అందరూ వాడు చెప్పేది వింటున్నారు. అప్పుడేమో, ఇదిగో! రోజూ మీయింట్లో పనికి వచ్చినప్పుడు నేను చూస్తుండే మా చిన్నారి ముద్దుల బాబయ్య.. సత్తె పమాణంగా యీనాయన వాళ్ళ వెంటబడి వారిని తరిమికొట్టి వెళ్ళగొట్టి నన్ను గట్టిగా పట్టుకుని యీడకి లాకొచ్చడయ్యా! నానోట్లో అమృతం పోసి

చచ్చిపోయిన నన్ను బతికించాడయ్యా! నా మీదొట్టు మా అన్న మీదొట్టు యిదంతా నిజం" ఇప్పుడు వాడి మాటలు ఎవరూ నమ్మటంలేదు.

ఇంత పసివాడికి వాళ్ళని తరిమికొట్టి వీడిని లాక్కొంచ్చేంత బలం ఎక్కడిది? అని "నువ్వు కళ్ళు తెరవగానే మాపిల్లవాణ్ణి చూసి, నువ్వు కలగన్నావేమో,అందులో వీడిని చూశాను అనుకున్నావేమో వెర్రివాడా! అనవసరంగా ఏ వేవోఊహించి అవన్నీ నిజమనుకోకు! ఇంటికిపోయి నాలుగు నాళ్ళు విశ్రాంతిగా ఉండు!" అన్నాడు నంద గోపుడు. గీత మాత్రం ఆమాటలు నమ్ముతోంది, ఎందు కంటే కళ్ళతో చూసింద గనక కన్నయ్య చేసినపని. యశోదమ్మ చటుక్కున పిల్లాణ్ణి లోనికి తీసుకెడుతుంటే వెనకే గీత కూడా వెళ్ళింది. ఆవిడ చాటుగా బోలెడంత దిష్టి తీస్తోంది పిల్లాడికి.

పసిడిగొలుసుల ఉయ్యాలలో మెత్తని పక్క వేసింది గీత యశోదమ్మ చెప్తే. ఆవిడ ముద్దుల అందాల చిన్నారి నల్లనయ్యని పరుండ బెడుతుంటే గీత వాని వంక చూసింది. తనని కనుచివరల నించి గంభీరంగా చూస్తూ తన సందేశాన్ని అందించాడు జగత్ప్రభువు. "చూశావా? ఈ అందరి మీద నామాయ తెర ఎలా కప్పి ఉందో! ఎందు కంటే సామాన్యుడిలాగా నన్ను వాళ్ళు పెంచాలి గనుక, నాతో కలసి తిరగాలి గనక అది నా లీల ! మరి మీ గోపిక లందరి మనస్సుతో నా నిజరూపం నిండి ఉంది. విశ్వాసంతో నన్నాశ్రయించి ఉన్నారు గనక మీకేసి నామాయ రాజాలదు అర్థంచేసుకో!" జగద్గురువు విశ్వాని కంతకీ అందించిన గీతా సందేశం ఇది !

## మనసు చలించుటయే వ్యభిచారము

- శ్రీ కాళీబాబు

# భగవద్గీత – వర్తమాన సమాజం

- రేఖ

(శ్రీ శుక బ్రహ్మాశ్రమము, కాళహస్తి వ్యవస్థాపకులు శ్రీశ్రీశ్రీ విద్యా స్వరూపానందగిరి స్వామివారి శతజయంతి ఉత్సవ సందర్భంగా, మద్రాసు విశ్వ విద్యాలయం వారి తెలుగుశాఖ మరియు శ్రీశుక బ్రహ్మాశ్రమంవారు సంయుక్తంగా నిర్వహించిన జాతీయ సదస్సుకి 'విశిష్ఠ అతిథి'గా ఆహ్వానింప బడిన పూజ్యయోగిని శ్రీశ్రీశ్రీ చంద్రకాళీప్రసాద మాతాజీ వారు 'భగవద్గీత - వర్తమాన సమాజం' అన్న అంశంపై చేసిన అభిభాషణను పై శీర్షికన ధారావాహికంగా అందిస్తున్నాము......)

విశ్వమును గుర్తించటానికి విద్యని అభ్యసించాలి. అయితే అంతరాళలలో ఉన్న నిజతత్త్వమును గుర్తింపజేయటానికి శ్రీకృష్ణ పరమాత్మ శ్రీమద్భగవద్గీత ద్వారా గురుశిష్య న్యాయం అందించారు. జగద్గురు స్థానంలో శ్రీకృష్ణస్వామి ఉండి, శిష్య స్థానంలో ఉన్న అర్జునుణ్ణి ఉద్ధరించటానికి యుద్ధభూమిలో బోధ చేశాడు.

సుఖదుఃఖాలు, రాగద్వేషాలు, అహంకార మమకారాలు, ఈర్ష్య అసూయలు అనే ద్వంద్వాల మధ్య కొట్టుమిట్టాడుతున్న మానవుడిలో నిరంతరం యుద్ధం జరుగుతూనే ఉంది. అటువంటప్పుడు జగద్గురు బోధ భగవద్గీత సరియైన మార్గాన్ని చూపిస్తుంది.

అర్జునుడికి కూడా తన కర్తవ్యం, తన స్వధర్మం, నిజతత్వం గీత సంపూర్ణంగా విన్న తరువాతనే అవగతమైంది. దైనందిన జీవితంలోనే కాకుండా, ఆధ్యాత్మికంగా కూడా గీత ఎంతో తోడ్పడుతుంది.

గీతలో ఒక్కొక్క శ్లోకం సాధనకు ఎలా ఉపయోగపడుతుందో చెబుతూ శ్రీమాతాజీ యీ విధంగా శెలవిచ్చారు. 'దేహినోస్మిన్ యథా దేహే' (గీత 2/13) అన్న సత్యమును గురించి విచారణ చేస్తూ ఉంటే జీవుడికి శరీరంలోని అవస్థాత్రయం గురించి, అలాగే మరణించిన తరువాత ఇంకొక శరీరం పొందుతాడు అన్న విషయం గురించిన సత్య జ్ఞానాన్ని గ్రహించగలిగితే శోక మోహాలను చెందడు.

అయితే యిట్టి జ్ఞానం సుస్థిరం కాకుండా, మనస్సును అంతర్ముఖం చేసి మథించకుండా మానవుడు శబ్దాది విషయాలయందే ఆసక్తిని పెంచుకుంటే, ఆ కోరిక తీరకపోతే క్రోధము; దాని వలన అవివేకము, మరుపు, బుద్ధి నాశనము క్రమంగా కలుగుతాయని గీత

2/62, 63 శ్లోకాలలో పరమాత్మ శెలవిచ్చాడు.

భగవంతునియందు, గురువుల యందు అచంచల భక్తి, విశ్వాసాలు కలిగి ఉండి, శ్రద్ధతో ఆ పదములను విచారించి, ఆచరించి నప్పుడే పైనతెలిపిన సత్యత్వము అనుభవానికి వస్తుంది. గురువుల యందు వినయవిధేయతలు కలిగి ఉండటమే శిష్యుని ముఖ్యలక్షణం. ఈ రోజులలో విద్యార్థులలో యీ లక్షణాలు ఎక్కువ కనబడుట లేదు. వినయంతో కూడిన విద్య రాణిస్తుంది. తానెవరో తాను గుర్తింప జేస్తుంది విద్య. 'విద్యా దదాతి వినయం'. కనుక గురువులను వినయంతో సేవించిన నాడే లక్ష్య సిద్ధి కలుగుతుంది.

తేనెటీగ వివిధ పుష్పాలలోని మకరందాన్ని సేకరించి తనకెంత అవసరమైతే అంతే స్వీకరించి, మిగతాదంతా ఒక తెట్టులో చేర్చి మనకి అందిస్తుంది. అదే విధంగా శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామివారు భగవద్గీతను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, సారాన్ని గ్రహించి, గీతలోని మకరందాన్ని వారు అనుభవించి, 'గీతామకరందము' అనే గ్రంథ రాజమును సరళమైన భాషలో, తమ దివ్యబోధను మిళితం చేసి, వాఙ్మయం ద్వారా సాధక లోకానికి అందించి, అధ్యాత్మిక భిక్ష పెట్టిన తేనటీగ వంటి మహానుభావులు.

గీతయొక్క మహిమను గురించి చెబుతూ విష్ణుమూర్తి 'గీతాజ్ఞాన ముపాశ్రిత్య గీతామే చోత్తమమ్ గృహమ్' అన్నాడు. గీత అనే ఉత్తమ గృహాన్ని ఆశ్రయించియే, యీ మూడు లోకాలను పాలిస్తున్నాని శెలవిచ్చాడు. ఈ మానవ దేహమే మన గృహం. దానిని గీతలో తెలిపిన సుగుణములనే ఆభరణాలతో అలంకరించుకోవాలి. (గీత 15/15) సర్వస్య చాహం హృదిసన్నివిష్టః (గీ.15/16) ద్వావిమౌ పురుషౌలోకే ..... తానే సమస్త ప్రాణికోటి హృదయాలలో అంతర్యామియై ఉన్నానని గీతాచార్యుడు శెలవిచ్చాడు. దీనిని బట్టి ఏ మానవుడు కూడా అధైర్యపడవలసిన పని లేదు. ఎందుకంటే జాతి, మత, కుల భేదాలు లేకుండా సర్వప్రాణికోటి లోనూ నివసించేది ఆ పరమాత్మే కనుక. ఎవరైనా సరే, తన యందున్న దైవాన్ని స్మరించి, గీత లోని సుగుణములను అలవరచుకుని, పవిత్ర ఆచరణ ద్వారా ఆ పరమాత్మను తెలుసుకొనవచ్చును.

-సశేషం

# సత్యం శరణం గచ్ఛామి

– వశిష్ఠ

(1982 సం॥లో శ్రీదేవి పూజా మహోత్సవాలలో నాల్గవరోజు శ్రీసద్గురు దేవులు చేసిన ప్రసంగం)

ఇది నాల్గవ రోజు. నాలుగు రోజులూ నాలుగు సెకండ్లవలె గడిచి పోయాయి. కాలగమనమే తెలియలేదు. ఎందుకని? కాలాతీత స్వరూపిణి యందే మన మనసు లగ్నమయి ఉన్నందువల్ల. అలా కాలాతీత వస్తువుతో లగ్నమయిన మనసు తద్రూపాన్నే పొందుతుంది. సముద్రుని యందు చేరిన నది సముద్ర రూపాన్నే పొందటం లేదా?

భవసాగరంలో మానవుడు మునుగుతూ తేలుతూ దరిగానక పరితపిస్తున్నాడు. ఆశ అనే పెనుతీగ బలంగా అతని పీకకు చుట్టుకుని సంసారమనే సుడిగుండంలోకి లాక్కు వెడుతుంది.



అగ్నిసాక్షిగా వివాహమాడిన సహధర్మచారిణిగాని, పున్నామ నరకం నుండి ఉద్ధరిస్తామనే పుత్రులుగాని యీ విపత్తు నుండి అతన్ని రక్షించలేరు. పైగా అతని అవస్థలో అతను ఉంటే, పోకముందే వీలునామ రాస్తే బాగుండని తాపత్రయ పడతారు ఆ దారాపుత్రులు. చాల ప్రేమ చూపిస్తారు కూడా. ఎక్కువ వాటా రాబట్టుకోవటానికి. ఇక ప్రభుత్వం వారు అతనివల్ల డబ్బులు ఎలా బయటకి లాగాలా ఎంత ఇన్‌కమ్‌టాక్స్ వేయాలా అని చూస్తూ ఉంటారు. మృత్యువేదనలో ఉన్న మానవుని యెడల బంధువులు, యితరులు చూపే ప్రేమ యిటువంటిది మాత్రమే.

కాని జగజ్జనని ప్రేమ యిలా మోసపు ప్రేమ కాదు. అది సత్యమైనది, నిత్యము, నిరవధికము, నిరపేక్షము. అది ఆమె బిడ్డలైన సర్వజీవకోటిపైన సమంగా వర్షిస్తుంది. అనేక శబ్దాలను, లయ విన్యాసాలను టేపు రికార్డు చేస్తుంది. ఆ టేపును చీల్చి చూస్తే, అవి కనబడవు. కాని కరెంట్‌కు తగిలిస్తే చక్కగా అన్ని వివరాలను పలుకుతుంది. సర్వవ్యాపకుడైన భగవానుడు మానవ దేహంలో అణువణువూ వ్యాపించి ఉన్నాడు. కాని శరీరం కోసి చూస్తే కనబడడు. మనసు ఆయన దివ్య చరణారవిందాల యందు లగ్నం చేసి చూస్తే

కనబడతాడు.

గంటకు పదివేల మైళ్ళు వెళ్ళే విమానం కూడా పెట్రోల్ లేనిదే అంగుళం కూడా కదలదు. అలాగే ఆ పరమాత్ముని అంశ తప్పుకున్నప్పుడు మానవుని శరీరము జడమైన రాయికంటె హీనము. ఆ రాయి చెడిపోదు కాని, యీ శరీరం నిముషాల మీద కుళ్ళిపోతుంది. అయినా ఆ శరీరం చూసుకుని విఱ్ఱవీగుతాడు మానవుడు. ఆ అవివేకానికి భగవానుడు నవ్వుకుంటాడు. కానీ దయాళువు కనుక స్మరిస్తే తరింపజేస్తాడు. ఆ తండ్రి ప్రేమ ఎంత గొప్పది!

కాళీపూజ చేస్తే ప్రమాదమని అది ఉగ్రశక్తి అని విరచుకు తింటుందని అంటారు కొందరు. ఎంత అవివేకము! ఎంత కృతఘ్నత! ఏ కన్నతల్లి అయిన తన బిడ్డను చంపుకుంటుందా? రక్కసులే అలా చేయరే! జగజ్జనని యెడ అట్టి ఘోర భావన చేయటం మహాపాపం కదా!

మృత్యుదేవత వాడికోరల మధ్య ఉన్నా మానవుడు జీవితాశ వదలడు. బ్రతికిస్తే ఎంత డబ్బు అయినా యిస్తా అంటాడు. డాక్టరు యిదే సమయమని డబ్బు గుంజుకుంటాడు. కాని ఆయువు మూడిన మానవుడిని ఎవరు రక్షించగలరు? అప్పుడైనా కనీసం నన్ను స్మరిస్తే రక్షిస్తాను అంటాడు భగవంతుడు. కాని ఆ స్మరణమాత్రం చేయడు మానవుడు. మానవుడు భగవంతునితో బేరం పెడతాడు. వ్యాపారంలో అపారంగా లాభం వస్తే, లేదా లాటరీలో లక్షలు గెలిస్తే ఏదో యిస్తానని ఆ లాభం రానేవస్తుంది. అయినా అన్నమాట చెల్లించుకోవటానికి కక్కుర్తి పడి చేయి వెనక్కి లాగుతుంది. ఆ భక్తి చిలకలపూడి బంగారం వంటిది. అది తరింపచేయలేదు. భగవంతుని యెడల నిర్మల భక్తి, అచంచల విశ్వాసం మాత్రమే మానవుని తరింపజేయగలవు.

-సశేషం

## మనసు కుక్కతోక వంటిది

- శ్రీ కాళీబాబు

# రత్నాకరుడు

– కామేశ్వరీ ప్రసాద

నారద మహర్షి పాత్రలేని పురాణ గాధలు చాల అరుదు. ఆయన వీణానాదం చేస్తూ, నారాయణ నామస్మరణ గానంతో అరణ్య మార్గంలో వెళ్తుండగా, ఆ గానానికి ముగ్ధుడైన 'రత్నాకరుడు' అనే కిరాతకుడు నారదమునీంద్రులను అడ్డగించి, "ఎక్కడికయ్యా! నీ ప్రయాణం నీ దగ్గర ఉన్న సొమ్ములన్నీ యిక్కడ పడవేసి వెళ్ళు. లేకపోతే నిన్ను కదలనీయను" అని హెచ్చరించాడు.



నారదుడు సమాధానం చెబుతూ "ఇలా దారిదోడిలు, దొంగతనాలు చేయటం నేరం. పాపం మూట కట్టుకుంటున్నావు. అయినా యీ దొంగిలించిన సొమ్ములన్నీ ఏం చేస్తావు? పోనీ, యీ సొమ్ముతో పోషించే నీ భార్యా బిడ్డలు నీవు చేసిన పాపంలో పాలు పంచుకుంటారేమో అడిగి చూడు. అలా అయితే నా దగ్గర ఉన్నవన్నీ నీకు తప్పక యిస్తాను" అన్నాడు.



రత్నాకరుడు వెంటనే యింటికి వెళ్ళి, భార్యా బిడ్డలను యీ విషయమై ప్రశ్నించాడు. వారు సమాధానం చెబుతూ "మమ్మల్ని పోషించపవలసిన బాధ్యత నీదే. కాబట్టి నీవు చేసిన పాపంలో మేము భాగం పంచుకోము" అని తేల్చి చెప్పారు.

రత్నాకరుడు విచార వదనంతో జరిగిన విషయాలన్నీ నారదునికి చెప్పాడు. నారద మహర్షి మాట్లాడుతూ "రత్నాకరా! నువ్వు యీ పాపం నుండి బయటపడే మార్గాన్ని ఆలోచించాను. దీని నుంచి నిన్ను రక్షించగలవాడు పరమాత్మ ఒక్కడే!" అంటారు. రత్నాకరుడు నారదమహర్షిని ప్రశ్నిస్తూ "పరమాత్మ ఎక్కడ ఉంటాడు? ఎలా ఉంటాడు? ఆయనను వేడుకొనే ఉపాయాన్ని నీవే తెలియజేయాలి స్వామీ!" అంటాడు. నారదులవారు రత్నాకరుణ్ణి ఒక చెట్టు క్రింద కూర్చోబెట్టి, మంత్రోపదేశం చేశారు. కానీ

రత్నాకరుడు 'రామ' అనే అక్షరాలను ఉచ్చరించలేకపోయాడు. నారదులవారు ఆలోచించి రత్నాకరునికి అందుబాటులో ఉన్న భాషలో 'మరా' అని ఉపదేశించి, దానిని వదల కుండా స్మరించమన్నారు. ఉపదేశం చేసిన తరువాత నారదులవారు తాము వచ్చిన కార్యం పూర్తి అయినందున నిష్క్రమించారు.

ఇంక రత్నాకరుడు దేశాన్ని, కాలాన్ని, దేహాన్ని, ఇంద్రియాలను మరచాడు. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలను దాటాడు. పంచ వాయువులను స్థంభింప చేశాడు. మనో బుద్ధి చిత్త అహంకారాలను దాట గలిగాడు. కుండలినీ శక్తిని ప్రేరణ చేసి, మూలాధారం నుండి సహస్రారం వరకు పయనించే తేజస్సులో లయమయ్యాడు.

రోజులు దొర్లిపోయాయి. కొంతకాలానికి నారద మహర్షి వచ్చి, చూశాడు. రత్నాకరుని కూర్చోబెట్టిన స్థలంలో పెద్ద పుట్ట ఉంది. దానిపై వృక్షాలు, లతలు వ్యాప్తి చెంది ఉన్నాయి. వృక్షము శాఖోపశాఖలై దానిపై పక్షులు పిల్లలతో కలకలలాడుతూ ఉన్నాయి. నారదమహర్షి పరికించి చూశాడు. అక్కడ ఉన్న పుట్టలో నుంచి దివ్య తేజస్సు వెలువడుతోంది. అంతేకాదు. రామనామంతో మారుమ్రోగుతోంది. రత్నాకరుని నారద మహర్షి గుర్తించాడు. అతని సంస్కారానికి ముగ్ధులయ్యారు. ఇప్పుడు రత్నాకరుడు అమనస్క స్థితిలో ఉన్నాడు. "లోకంబులు, లోకస్థులు, లోకేశులు, తెగిన అలోకంబగు పెంజీకటి కావల" వెలిగే అతనిని చూడగలిగిన స్థితిలో ఉన్నాడు.



రత్నాకరుని నామధేయం 'వాల్మీకి మహర్షి'గా నారదమహర్షి ప్రసాదించాడు. రత్నాకరుడు వల్మీకము అంటే పుట్టలో ఉన్నాడు కాబట్టి ఆ పేరును ఆయనకు ప్రసాదించారు. ఆ తరువాత వాల్మీకి మహర్షి రామాయణ మహాకావ్యాన్ని రచించిన విషయం మనందరికీ తెలిసినదే కదా! అందువలన సాధకులు తమకు లభించిన సదవకాశాన్ని జారవిడచుకోకుండా సద్వినియోగం చేసుకోవాలని గమనించాలి. నమ్మితే బంగారు పిచ్చుక! నమ్మకపోతే బూడిదే!

శ్రీరామ రామేతి రమే రామే మనోరమే
సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే

# శ్రీదత్తాత్రేయ పరశురామ సంవాదము

- పరాశర ప్రసాద్



శ్రీ దత్తాత్రేయులు పరశురామునికి బోధ చేస్తూ, "పరమ శ్రేయస్సు అనే సౌధాన్ని ఆరోహణ చేయటానికి విచారణ అవశ్యము సుమా! విచారణ మృత్యునివారణకు మూలము. విచారణ లోపిస్తే మోహానికి లొంగక తప్పదు. రాక్షసులు నాశనానికి కారణము విచారణ లేకపోవటమే. బ్రహ్మ శిరచ్ఛేదాన్ని పొందటానికి కారణము విచారణ లేకపోవటం వలననే కదా! కర్తవ్యానికి మోహితులు అవటానికి కారణము విచారణ లేకపోవటమే. విచారణకు దోహదం చేసే పరమ శ్రేయస్సాధనమైన బుద్ధి కలగటానికి త్రిపురా దేవి దయ ప్రాప్తించాలి. త్రిపురాదేవిని ఆరాధిస్తే, చితాకాశంలో సద్విచారణ అనే సూర్యోదయం కలుగుతుంది. విచారణాశీలుడు శ్రేయస్సును కోరుకుంటాడు. అవివేకి ప్రేయస్సును ఎంపిక చేస్తాడు. అది అందరికి తెలిసిన విషయమే కదా!



శ్రీ దత్తాత్రేయుని బోధ విన్న భార్గవుడు తిరిగి ప్రశ్నించారు.

"త్రిపురాదేవి మహాత్మ్య శ్రవణం వలననే విచారణ చేయవలెననే తలంపు కలిగినది. యదార్థమే కాని అది కూడా సహజక్రియేం అని భావించాలా? అలా భావించినట్లయితే అందరూ ఆ భాగ్యాన్ని ఎందుకు పొందలేక పోతున్నారు? ఆ మహాత్మ్యమును వినాలనే సంకల్పము యింతవరకూ నాకు కూడా కలుగలేదు కదా! దుఃఖము లేదా ఆపద సంభవించినప్పుడు మాత్రమే దాని మీద ఆసక్తి ఎందుకు కలగాలి? శ్రీరామచంద్రునిచే పరాభవించినప్పుడు మాత్రమే నాకు దాని మీద ఆసక్తి కలిగినది కాని అంతకుపూర్వం ఎందుకు



కలుగలేదు?" అని భార్గవులు ప్రశ్నించారు.

శ్రీసద్గురు దత్తాత్రేయులు భార్గవునకు సమాధానం చెబుతూ "శ్రేయస్సునకు మూలము సత్పురుషుల సాంగత్యమే సందేహం లేదు. పరమార్థాన్ని పొందటానికి బీజము సత్సంగము. మహాత్ముడైన సంవర్తుని సాంగత్యము ద్వారానే శ్రేయస్సు అనే ఫలాన్ని పొందగలిగే స్థితికి చేరగలిగావు. దానిని గుర్తించు.

లోకంలో ఎవరైనా సరే సత్సాంగత్యం ద్వారానే శ్రేయస్సును పొంద గలుగుతారు. వేరొక విధంగా పొందటం దుర్లభం. మన హృదయాలలో అవిచార రూపంగా ఉన్న త్రిపురాదేవి మనం భక్తితో ఆవిడను ఆరాధించటం వలన మన హృదయాన్ని విచార రూపంగా పరిణమింపజేసి, మనకు సన్మార్గము చూపునన్న విషయము ఎరిగినవాడే ధన్యుడు. భార్గవా! నీవు అట్టి భాగ్యమునే పొంది యున్నావు" అన్నారు శ్రీదత్తాత్రేయులు.



భాస్కరా! అమృత సముద్రము మీదుగా కాకి ప్రయాణము చేయుచున్నప్పుడు, ఆ సముద్రములో అది రెట్టవేసిననూ సముద్రమునకు ఏ లోటూరాదు.

ఎట్లనగా ధర్మావలంబియగు మానవుని, ఒక నీచుడు మిక్కిలి హీనములైన మాటలచే నిందించిననూ ఆ ధర్మనవర్తనునకుఏ మాత్రమూ లోపము రాదని భావము.

- భాస్కర శతకము - 105

# సత్సంగామృతం

- మురళీ

(శ్రీబాబూజీ మహరాజ్‌వారి రజతోత్సవ మహాపుణ్యారాధన మహెూత్సవాలలో భాగంగా 25-11-2013 సోమవారం రోజున శ్రీమాతాజీ అందించిన బోధామృతం సంక్షిప్తంగా)

కాలం వెళ్ళిపోవటం దాని సహజ స్వభావం. దానిలో జరుగుతున్నది నిక్షిప్తం చేసుకోవటం మానవుని స్వభావమై ఉండాలి. ఎందుకంటే ఏ తత్వాన్నైతే మనం జుర్జు కుంటున్నామో, ఆ తత్వాన్ని ప్రసాదించినవారు, తత్త్వము కూడా ఎప్పటికీ త్రికాలములందు కూడా మారనటువంటిది. అది మూడు అవస్థలలో కూడా మనలో చెరగని ముద్ర వలె ప్రకాశిస్తుంది. మనకు మహాత్ములు నేర్పింది, చూపించింది, ప్రసాదించినది. నిత్య శాశ్వతమైనటువంటిది కాబట్టి అటువంటి మహత్తరమైన అనుభూతిని మాటిమాటికి నెమరు వేసుకుంటూ మనస్సును స్థిరపరచుకోవాలి.

గురుతత్వం యింద్రియాతీతంగా మనలో ప్రకాశిస్తోంది. అది ఏ ఒక్కరిలో మాత్రమే ఉండేటటువంటిది కాదు. అందరిలోను నిండిఉండేటటువంటిది అనే విషయాన్ని సాధుమహాత్ములు మనకు తెలియజేస్తున్నారు.

ఆరాధన అనే కార్యక్రమానికి ముఖ్యంగా బోధామృతాన్ని బాగా సేవించటం, సేవించి ఆ యా స్థితులలో మన మనస్సు ఎక్కడ ఉంది, ఇంకా ఎంత నేర్చుకోవాలి అనే విషయాన్ని గుర్తిస్తే అది మనకు భిన్నంగా ఉండదు. ఎందుకంటే నీ స్వరూపం అది అని గుర్తింపజేస్తున్నారు సాధుమహాత్ములు.

అది చెప్పి, చూపించి, అనుభవింపజేసేవారు ఒక్క గురుదేవులు మాత్రమే. అందుకనే – 'న గురో రధికం తత్త్వం, న గురో రధికం తపః, న గురో రధికం జ్ఞానం తస్మై శ్రీ గురవే నమః'. ఎందుకంటే 'నేను బిగిసిపోయి ధ్యానం చేస్తాను. 24గంటలు అలాగే ఉండిపోతాను' అంటే నువ్వేమైనా స్థాణువైన స్థంభానివా? కాదు.

మనం అనుష్ఠానం చేసుకుంటూ ఉండాలి, తిరిగి ప్రపంచంలో సంచరిస్తున్నా మనస్సు కదల కూడదు. గురువుల దగ్గర మనస్సు ఏ ముద్రలో కూర్చొబడిందో ఆ ముద్ర యందు నీ మనస్సును నిలబెట్టుకుంటూ, నీ స్వధర్మమైన కార్యక్రమాలను నిర్వర్తించుకోవాలి. ఆ సమయంలో అహంకార మమకారాలకు, ఈర్ష్య అసూయలకు తావులేకుండా వుండటమే నిజమైన స్థితి అని మహాత్ములు తెలియజేస్తున్నారు. దానికి శ్రీ గురుదేవులు అంటూ ఉండేవారు – "నీ రెండు చేతులతోనూ గురుదేవుల పాదాలు పట్టుకో. నీకు పని చేసుకోవలసివచ్చినప్పుడు నీ ఎడమ చేతితో పాదాలను పట్టుకుని కుడిచేతితో అన్ని పనులు చూసుకుని, పని పూర్తి అవగానే కుడిచేతిని మరల

పాదాలవద్దకు చేర్చు" అంటే చేతులే అని కాదు, నీ చేతులు, నీ చిత్తవృత్తి. నీ చిత్తవృత్తి మీద ఆధారపడి ఉంటుంది అభిమానం కూడా. అటువంటి సద్భావనని, సహృదయాన్ని మహాత్ములు మనకు పంచిపెట్టారు. అటువంటి విషయాన్ని మహాత్ములు మాటిమాటికి గుర్తింపచేస్తూ ఉంటే ఆనందలహరిలో ఓలలాడటం కోసము మహాత్ములు మనకోసమే అవతారాన్ని ధరిస్తున్నారు. వారు చూపించే ఆదరణ, నిర్వహించే యీ కార్యక్రమాలు మనలను ఉద్ధరించటం కోసమే.

మహాత్ములందరి ముఖపద్మముల ద్వారా వచ్చిన అమృత మయమైనటువంటి తత్వ విషయాలను, భగవద్విషయాలను ఎంతో ఆనందంగా విన్నామా? అనుభవించామా? వినడానికి చాలా వింటున్నాము. బాహ్యవిషయాలు ఒక చెవితో విని రెండవ చెవితో వదిలి పెట్టాలి. మహాత్ముల సన్నిధిలో ఉన్నప్పుడు చెవులారా విని, హృదయమనే లాకర్‌లో నింపుకోవటం కోసమే ఆరాధన. ఇలాంటివి వినటం కోసమే మనలో ఉన్నటువంటి తుప్పు వదిలించుకోవటం కోసమే, మంచి విషయాలను మనలో భద్రపరచుకోవటం కోసమే ఆరాధన.

గురుతత్వం చాల గొప్పది. అనంతమైనటువంటిది. సర్వకాల సర్వావస్థలలో అటువంటి స్థితిలో నిలబడాలి. శ్రీసద్గురుదేవుల పరమ అనుగ్రహము మనందరిపై వర్షించు గాక! గురుపాదుకలు సర్వదా కాపాడుగాక! సుఖీభవ! సుఖీభవ!!

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు, విజయవాడ వాస్తవ్యులు అయిన శ్రీమతి అల్లంకి వెంకట భార్గవతమ్మ 2-3-2014 ఆదివారం శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 90 సంవత్సరాలు. శ్రీసద్గురు దేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక!

వీరి కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాము.

# దాశరథీ! కరుణాపయోనిధీ!

- పరాశర ప్రసాద్

విభీషణుడు శ్రీరామచంద్రునికి శరణాగతి పొంది తనను కరుణించమని ప్రార్థించినప్పుడు, శ్రీరామచంద్రుడు విభీషణుని చేరదీసి, ఆశీర్వదించి, "విభీషణా! మిత్ర భావంతో ఆశ్రయించినవారిని ఎన్నడూ విడిచిపెట్టను. వారిలో ఎన్ని దోషాలున్నాసరే సజ్జనులు ఆ దోషాలను పరిగణలోకి తీసుకొనకూడదు. ఆదే ఆశ్రిత వాత్సల్యమంటే.



వత్స అంటే దూడ. ఆవుకి తన దూడపై ఉండే ప్రేమనే వాత్సల్యం అనవచ్చు. ఎందువలనంటే నలిగిన గడ్డిని కూడా తినటానికి యిష్ట పడని గోవు అప్పుడే పుట్టిన దూడ దేహాన్ని శుభ్రపరచి మురికి తొలగిస్తుంది. అది వాత్సల్యం. అలాగే సత్పురుషులు తమను ఆశ్రయించిన వారిని చేరదీసి, వారిలో ఉన్న దోషాలను వారికి ఏ కష్టమూ కలిగించకుండా తొలగిస్తారు. సంపూర్ణశరణాగతిని పొందిన వారిని సరిదిద్దే బాధ్యత స్వీకరిస్తారు సత్పురుషులు. ఇంతకాలానికి సంస్కరించటానికి యీ జీవుడు లభించాడని ఆనందపడతారు. అంతవరకూ ఎన్ని తప్పులు చేసినా దాసుని తప్పులు దండంతో సరి అన్నట్లుగా సరిపెట్టుకుని సంస్కరిస్తారు.



శ్రీరామచంద్రునికి ప్రక్కనే ఉన్న వానరులంతా విభీషణుడు రాక్షసుడని, రావణాసురుని తమ్ముడని తమ శత్రువని అతనికి ఆశ్రయం యివ్వద్దని వారించారు. అయినా రామచంద్రుడు కరుణా సముద్రుడు కనుక అనుగ్రహించాడు. హనుమకు తన ప్రభువు యొక్క లీల జ్ఞప్తికివచ్చి ఆనందాశ్రువులు జాలువారాయి.

హనుమ సీతామాతను వెతకటానికి లంకకు వెళ్ళినప్పుడు, ఆమె తనకు చెప్పిన సంఘటన గుర్తుకు వచ్చింది. గంగానదీ ప్రాంతంలో

సిద్ధాశ్రమంలో తాను తన ప్రభువుతో కలిసి ఉద్యానవనంలో విశ్రమిస్తున్న సమయంలో మాంసాపేక్షగల కాకము వచ్చి తనను ముక్కుతో పొడిచి గాయము చేస్తే దాని ద్వారా స్రవించిన రక్తము శ్రీరామ చంద్రుని విశ్రాంతికి అంతరాయం కలిగిస్తే మేల్కొన్నాడని సీతమ్మ తనకు చెప్పిన విషయం జ్ఞాపకం వచ్చింది.

అంతేకాదు శ్రీరామచంద్రుడు మేల్కొని నాలుగు దిక్కులా చూస్తూ తనకి అభిముఖంగా ఉన్న వాయసమును చూసి యింద్రుని పుత్రునిగా గుర్తించి దర్భాసనము నుండి ఒక దర్భను తీసి మంత్రించి బ్రహ్మాస్త్ర ప్రయోగము చేసిన సంఘటన స్ఫురణకు వచ్చింది. అంతేకాదు భీతి చెందిన ఆ కాకము ముల్లోకములు తిరిగి గత్యంతరము లేక తిరిగి శ్రీరామచంద్రుని శరణుజొచ్చుట, ప్రభువు ఆ కాకి ప్రాణములను కాపాడిన సంఘటన గుర్తుకువచ్చి తన ప్రభువు యొక్క కరుణను వర్ణింప ఎవరికి సాధ్యము అని హనుమ ఆనందపడిపోయాడు!

అంతటి కరుణామూర్తి రావణుని సంహరిస్తాడా! కాదు తనలో లయమొనర్చుకుంటాడు అనే భావన సజ్జనులకు మాత్రమే స్ఫురిస్తుంది.

## ప్రేమనెవరు కొంటారు?

- కె. భాస్కర రాజు

మల్టాలో శ్రీప్రేమానంద (శ్రీరామకృష్ణుల శిష్యులు) మానవులను మాధవునిగా సేవించండి అంటూ శ్రీవివేకానందుల అనుష్ఠాన వేదాంతం గురించి మాట్లాడుతున్నారు. ఆ ప్రసంగం మధ్యలో ఒకాయన ప్రేమభక్తి గురించి మాట్లాడండి అని కోరాడు. దానికాయన "ఇక్కడ ప్రేమ భక్తి గురించి వినదగిన యోగ్యుడు ఎవరూ లేరు అంటూ ఒక చిన్న కథ చెబుతాను వినండి అన్నారు.

ఒకసారి ఒక వీధివ్యాపారి ' ప్రేమ నెవరు కొంటారు? ప్రేమ నెవరు కొంటారు?' అంటూ పెద్దగా అరుస్తున్నాడు. జనం తమ యింటి తలుపులు తెరచి దాని ఖరీదెంత? అని అడిగారు. ఆ వ్యాపారి అన్నాడు ఖరీదా! అది అమూల్యమైనది. ఈ అమూల్యమైన ప్రేమకు బదులుగా మీ తలను యిస్తే యివ్వగలను. మీలో ఎవరైనా మీ తల యివ్వటానికి సిద్ధంగా ఉన్నారా? వెంటనే జనం తమ యింటి తలుపులు మూసేసుకున్నారు. ఇక్కడ ఎవరైనా తలను (అహంకారాన్ని) వదలటానికి సిద్ధంగా ఉన్నారా?" అంటూ ప్రేమానందులు ప్రశ్నించారు. ప్రతి ఒక్కరు మౌనంగా ఉండి పోయారు.

# సమర్థ సద్గురు

**(యాజమాన్యం తదితర వివరాలు)**

FORM - 4 (**8వ నిబంధన ప్రకారము**)

| | |
|---|---|
| ప్రచురణ స్థలం | - శ్రీ కాశీ గార్డెన్స్, నంబూరు R.S |
| ఎంత కాలానికి ఒకసారి | - మాస పత్రిక |
| ముద్రాపకుని పేరు | - సి.వి. రమణబాబు |
| జాతి | - భారతీయుడు |
| విలాసము | - D.NO. 3-499 శ్రీకాళీగార్డెన్స్, నంబూరు R.S గుంటూరు జిల్లా , ఆంధ్ర ప్రదేశ్ |
| సంపాదకుని పేరు | - డి.జె.బి.కె. లాల్. |
| జాతి | - భారతీయుడు |
| విలాసము | - D.NO. 3-499 శ్రీకాళీగార్డెన్స్, నంబూరు R.S గుంటూరు జిల్లా , ఆంధ్ర ప్రదేశ్ |
| పత్రిక యజమానులు | - యోగిని శ్రీ చంద్ర కాళీ ప్రసాద మాతాజీ ఛారిటబుల్ ట్రస్ట్ D.NO. 3-499 శ్రీకాళీగార్డెన్స్, నంబూరు R.S గుంటూరు జిల్లా , ఆంధ్ర ప్రదేశ్ |

పై విషయములు నాకు తెలిసినంత వరకు వాస్తవములని తెలియచేస్తున్నాము.

శ్రీ కాళీ గార్డెన్స్ ( సం) సి.వి. రమణబాబు

ది. 1-3-2014 పబ్లిషర్

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

గత సంచిక తరువాయి

- విజయేశ్వరానంద ప్రసాద్

**శ్రీ లలితానంద సరస్వతి స్వామి (గురువుగారి)తో శ్రీబాబు**

అప్పటికి యింకా ఇందిరకు పూర్తిగా స్వస్థత చేకూరలేదు, మాట్లాడలేనంత నీరసంగా ఉన్నది. కాని ప్రతి రోజూ సమయానికి కాలేజికి వెళ్ళటం, క్లాసులలో మునిపటికంటే ధాటిగా, విద్యార్థులంతా ఆనంద పడేటట్లుగా పాఠాలు చెప్పటం, యితర లెక్చరర్లతో ఎంతో సరదాగా ఉండటం జరిగిపోతోంది ఇందిరకు, శ్రీ బాబే తనలో ఉండి యిలా తన బదులు కాలేజి విధులు నిర్వహిస్తున్నట్లు అయింది.



గురుదేవుల భక్త పరాధీనతకు యిది మచ్చుతునక. భాగవతంలో బ్రహ్మదేవుడు గోవులను, గోపాలురను మాయం చేస్తే, శ్రీ కృష్ణుడు వారి వారి రూపాలన్నీ తానే ధరించి, వ్రజవాసులను మురిపించి మరిపించి, ఒక సంవత్సరం పాటు లీలా వినోదం సల్పినట్లు, శ్రీ బాబు ఇందిర రూపంలో వారం రోజులు వ్యవహరించారు. తరువాత ఇందిర శెలవు పెట్టి మళ్ళీ భీమవరం వచ్చేసింది.

ఇది యిలా ఉండగా, ఇందిర గుంటూరు వెళ్ళిన రోజున సాయంకాలానికి శ్రీ బాబు కలకత్తా నుంచి ఎంతో నీరసంగానూ, వాంతులతోనూ, బలహీనంగా, కదలలేని పరిస్థితులలో భీమవరం తిరిగి వచ్చారు. ఇందిర అనుభవించ వలసిన శారీరక బాధలను వారు స్వీకరించి. ఇందిరకు కాలేజికి హాజరయ్యే అవకాశం కల్పించారు. ఇందిర తిరిగి భీమవరం వచ్చాక శ్రీ బాబు కోలుకున్నారు. ఇందిరకు మళ్ళీ వ్యాధి ఎక్కువైంది.

అంతటి శారీరక అస్వస్థతలో ఉన్నా, ఇందిర నిరంతరమూ శ్రీ గురుధ్యానం లోనే ఉండేది. ఆమె ధ్యానంలో ఎన్నెన్నో దివ్య దర్శనాలను పొందింది. ఒక రోజున ఇందిర ధ్యానం చేసుకుంటుండగా ఆమెకు శ్రీ బాబు దశ అవతారాలను వరుసగా తమ రూపంతో దర్శనం ప్రసాదించారు.

ఇందిరకు ఇంకా బాగా సుస్తీగా ఉన్నప్పుడే, ఒకసారి శ్రీ బాబు

తిరుపతి వెళ్ళవలసి వచ్చింది. బయలుదేరుతూ శ్రీ బాబు "ఇందిరకు ఏమీ పరవాలేదు, నేను తిరిగి వచ్చేవరకు జాగ్రత్తగా చూసుకోండి" అని గురువుగారిని హెచ్చరించి వెళ్ళారు. వారు వెళ్ళిన మూడో రోజున ఇందిరకు వ్యాధి ముదిరి పోయింది. ఇంజెక్షన్ యిస్తే ఎక్కలేదు. డాక్టర్లు పెదవి విరిచి వెళ్ళిపోయారు. ఒళ్ళు చల్లగా మంచులాగా అయిపోయింది. శ్వాస నిలిచి పోయింది. అందరూ 'అయిపోయింది' అంటున్నారు. కాని గురువు గారు మాత్రం శ్రీ బాబు మాటలను స్మరించుకుని, అచంచల విశ్వాసంతో ధ్యానంలో ఉండిపోయారు.

శ్రీ బాబు తరుపతి నుండి గుంటూరు వెళ్ళారు. ఆ రాత్రి ఒంటి గంటకు శ్రీ బాబు గోపాల్‌ని లేపి " అర్జంటుగా బయల్దేరి భీమవరం వెళ్ళాలి. అక్కడ ఒక ప్రాణిని రక్షించవలసి ఉన్నది, కారు తీసుకురా" అన్నారు. ఆఘ మేఘాలమీద శ్రీబాబు భీమవరం వచ్చి ' ఇందిరా! పాపా ! ' అని పిలుస్తూ తాతయ్యగారింట్లో అడుగు పెట్టటం, ఇందిరిలో కదలిక రావటం ఒక్కసారే జరిగాయి. ఇందిర నిద్ర లేచినట్లు లేచి శ్రీ బాబును చూసి 'అప్పుడే ఎలా వచ్చేశారు? ఇంతకు ముందేగా, అక్కడ కనిపించారు ? గరుత్మంతుడి మీద వచ్చారా? అన్నది. ' నీ వెనకాలే నేనూ వచ్చాను లే ' అని శ్రీ బాబు ఇందిర తలపై తట్టి లోపలికి వెళ్ళిపోయారు.

ఆ తరువాత ఇందిర తన అనుభవాన్ని చెబుతూ " డాక్టర్లు నా చెయ్యి చూస్తుండగానే నాకు బాహ్యస్మృతి పోయింది. ఒక దివ్య విమానంలో దేవతలు నన్ను తీసుకొని వెళ్ళి, క్షీర సాగరంలో శేష శయనుడైన శ్రీమన్నారాయణమూర్తి సన్నిధిలో నిలిపారు. ఆ దివ్యదర్శనం ఎంతో ఆనందాన్నికలిగించింది. అయినా ఏదో వెలితిగా ఉంది. అక్కడ శ్రీ బాబు కనబడలేదు. నేను శ్రీబాబు కోసం వెతుక్కుంటుంటే, శ్రీమన్నారాయణమూర్తి శ్రీబాబు రూపంలోనూ, మళ్ళీ శ్రీబాబు శ్రీమన్నారాయణమూర్తి రూపంలోనూ, మార్చి మార్చి దర్శనం ఇచ్చారు. అప్పుడు శ్రీబాబు ' ఇక నువ్వు తిరిగి వెళ్ళు అన్నారు. 'మీరు రానిదే నేను వెళ్ళను' అన్నాను. ' నేనూ వస్తున్నానులే, పద' అన్నారు శ్రీబాబు. అందుకే నేను లేవగానే శ్రీ బాబును అలా అడిగాను" అన్నది ఇందిర. శ్రోతలు ఆనందాశ్చర్యాలలో మునిగి తేలారు.

-సశేషం

(గతసంచిక తరువాయి) విష్ణు  కథలు -రమణ ప్రసాద్

# 7. రోహిదాసు

ప్రభూ! నువ్వు ముత్యము అయితే మేము దానిని అంటి ఉన్న దారము వంటి వారము. బంగారానికి పరిమళమబ్బినట్లు నావలననే మీకు ఒక విలువ ఏర్పడుతోంది.

ప్రభూ! నువ్వు స్వామివి. మేము నీదాసులం. రోహిదాస్ యొక్క భక్తి ఇదే!" అని గానం చేశాడు. రాజుగారు రోహిదాసు భక్తికి మెచ్చి అతనిని పలువిధాల సత్కరించారు.



ఒకనాడు ఒక బ్రాహ్మణుడు లోహిదాస్ గొప్పతనాన్ని గురించి విని అతనిని పరీక్షించాలని వస్తారు. ఆ సమయంలో రోహిదాస్ పూజా మందిరంలో పూజ చేస్తూ ఉంటాడు. బ్రాహ్మణుడు కిటికీ గుండా అతను పూజించే విధానాన్ని చూస్తాడు. రోహిదాస్ చర్మంతో తయారు చేసిన ప్రతిమను పూజించటం చూస్తాడు. బ్రాహ్మణుడు లోపలికి వచ్చి. చర్మంతో చేసిన ప్రతిమకు పూజచేస్తావా? ఎంత అపచారం?" అని మందలిస్తాడు.

రోహిదాస్ బ్రాహ్మణునికి నమస్కరిస్తూ "విప్రోత్తమా! మీరు సర్వజ్ఞులు. తమకు తెలియనిది ఏముంది. చర్మం ఎలా నీచమైంది? పూజ చేసే వానిపై కప్పబడి ఉన్నది చర్మం కాదా. జింక చర్మాన్ని ఆసనంగా జపధ్యానాదులకు ఉపయోగిస్తున్నారు కదా! భగవత్సంకీర్తనకు ఉపయోగించే మృదంగం చర్మంతో చేసిందే కదా! అలాంటప్పుడు చర్మంతో చేసిన ప్రతిమ నీచమైనది ఎందుకు అవుతుంది? నే చేసే పూజా విధానం శాస్త్ర సమ్మతం కాక పోతే చెప్పండి. మీరు చెప్పిన విధంగా ఆచరిస్తాను.

బ్రాహ్మణుడు కోపోద్రిక్తుడై "ఓరీ భ్రష్టుడా! ఆపు నీ వ్యర్థ ప్రసంగాలు. నీచ కులజుడవైన నువ్వు నాకు పూజా విధానం నేర్పుతావా? ఉపనయన

సంస్కారం లేని నీజాతికి పూజ చేసే అర్హత లేదు" అంటాడు.

"ద్విజోత్తమా! జన్మతో అందరూ శూద్రులుగానే జన్మిస్తారు. కర్మచేత విప్రులు అవుతారు. కర్మభ్రష్టులైన విప్రులు శూద్రులుకారా? అలాగే అంత:కరణ శుద్ధిగల శూద్రునకు బ్రాహ్మణత్వం ఎందుకు రాకూడదు? నాకు ఉపనయన సంస్కారం భగవంతుడే చేసి ఈ జన్మకు పంపాడు" అంటాడు వినమ్రతో. వాచావేదాంతానికి అంతులేకుండా ఉంటే పైగా ఉపనయనం అయిందని చెపుతున్నావు. అలా అయితే యజ్ఞోపవీతం ఏదీ? మాకంటికే కనపడకుండా ఉందా ఏమిటి? అవునులే భగంతుడు ఉపనయనం చేశాడన్నావుకా! మాకు ఎలా కనపడుతుందిలే? అంటాడు వ్యంగ్యంగా.

"నాకు యజ్ఞోపవీతం ఉంది చూడండి" అని హృదయాన్ని చీల్చి లోపలి యజ్ఞోపవీతాన్ని చూపుతాడు. బ్రాహ్మణుడు ఆశ్చర్యపడి తన పొరపాటును గ్రహించి భక్తులు జాతి, కులమత భేదాలకు అతీతులని గ్రహించి రోహిదాసు పాదాలపై పడి క్షమాభిక్ష కోరతాడు.

రోహిదాస్‌కు వివాహమైంది. పిల్లలు కలిగారు. తల్లిదండ్రులు మరణించారు. దారిద్ర్యం అనుభవించాల్సి వచ్చింది. హృదయంలో రామనామాన్ని నింపుకుని, సదా రామనామస్మరణ చేస్తూ తృప్తిగా జీవిస్తూ ఉంటాడు.

-సశేషం

శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు, ఆశ్రమ స్థిర నివాసులు అయిన శ్రీమతి కొండ శ్యామలాంబగారు 2-3-2014 ఆదివారం శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 87సంవత్సరాలు. శ్రీసద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక!

వీరి కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాము.

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL